

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


# దశాబ్దాల నిరీక్షణకు తెర





## 939 పేద కుటుంబాలకు శాశ్వత ఇళ్ల పట్టాలు

- నెల్లూరులో సర్వేపల్లి కట్ట ఇళ్ల పట్టాల పంపిణీని వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.600 కోట్ల విలువైన 22.31 ఎకరాల భూమిపై పేదలకు హక్కులు
- 701 మంది మహిళల పేరిట పట్టాలు...
- వచ్చే సంక్రాంతిలోగా నెల్లూరులో మరో 4వేల ఇళ్ల పట్టాల పంపిణీకి సీఎం ఆదేశం

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా నివసిస్తున్న పేద కుటుంబాలకు శాశ్వత హక్కులు కల్పిస్తూ వారి సొంతింటి కలను సాకారం చేసింది కూటమి ప్రభుత్వం. నెల్లూరులోని సర్వేపల్లి కట్ట ప్రాంతంలో 22.31 ఎకరాల పరిధిలో 939 కుటుంబాలకు సుమారు రూ.600 కోట్ల విలువైన ఉచిత ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివారం అమరావతిలోని క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు.
ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... లబ్ధిదారుల్లో 701 మంది మహిళలు ఉండటం తమ ప్రభుత్వం మహిళా సాధికారతకు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు.
వచ్చే సంక్రాంతిలోగా నెల్లూరులో మరో 4వేల ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా పేదలకు భద్రత, ఆత్మగౌరవం, ఆస్తి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన సాగిస్తోందన్నారు. కాగా దసరా పండుగ వేళ తమకు శాశ్వత ఆస్తి హక్కు కల్పించిన సీఎం చంద్రబాబుకు లబ్ధిదారులు, మహిళలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2



## ఇంద్రకీలాద్రికి శరన్నవరాత్రి శోభ

**వైభవంగా ప్రారంభమైన ఉత్సవాలు**

**తొలిరోజు బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ**

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభ మయ్యాయి. ప్రసన్నరూపిణి అయిన కనకదుర్గ అమ్మవారు 'బాలా త్రిపురసుందరీ దేవి' అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు, తెల్లవారుజామునే వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారికి స్నపనాభిషేకం, ప్రత్యేక అలంకార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలిరోజు ఉదయం 8 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



## గొడ్డలి పార్టీకి దెబ్బకొట్టాలి

**'స్థానికం'లో కూటమే గెలవాలి**

**గెలిచే అభ్యర్థులకే టికెట్లు**

**మిత్రపక్షాలతో పక్కా సమన్వయం ఉండాలి**

**టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు**

**ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలతో ప్రత్యేక టెలీకాన్ఫరెన్స్**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పక్కా ప్రణాళికతో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, బూత్ కమిటీలతో పాటు గ్రామస్థాయి కార్యకర్తల వరకు ఆదివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అభ్యర్థుల ఎంపిక, నామినేషన్ల దాఖలులో జాగ్రత్తలు, మిత్రపక్షాలతో క్షేత్రస్థాయి సమన్వయం, ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టడంపై దిశానిర్దేశం చేశారు. సర్వేలు, క్షేత్రస్థాయి బలం ఆధారంగా ఎవరైతే కచ్చితంగా గెలుస్తారో వారికే బి-ఫామ్ ఇస్తాం" అని స్పష్టం చేశారు. మిత్రధర్మంలో భాగంగా జనసేన, బీజేపీ నేతలను కలుపుకుని నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో సమన్వయ కమిటీలు వేసుకోవాలి" అని ఆదేశించారు. అన్నిచోట్లా కూటమి అభ్యర్థులే గెలవాలని పిలుపునిచ్చారు. 4



## బీసీలకు 40% సీట్లు

- 'జయహో బీసీ.. జనాభాలో సగం, కూటమి ఇచ్చింది బలం' నినాదంతో ప్రచారం
- స్థానిక ఎన్నికల్లో 'ట్రిపుల్ ఇంజిన్' సర్కార్ సాధనే లక్ష్యం 3
- రాబోయే 50 రోజులు ప్రతి ఒక్కరూ కష్టపడాలి
- ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- పనితీరు ఆధారంగా నేతలకు రేటింగ్
- వర్చువల్ సమావేశంలో చంద్రబాబు

## ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలను గ్రాండ్ సక్సెస్ చేయాలి

- 'సరస్ మేళా' దేశానికి ఆదర్శంగా నిలవాలి
- విజయవాడ ఉత్సవ్ 2.0లో సెలబ్రేషన్, ట్రెడిషన్ ఉండాలి
- దేవాదాయ, పర్యాటక శాఖల అధికారులు, మంత్రులు, ఎన్టీఆర్ జిల్లా అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష 5




# దశాబ్దాల నిరీక్షణకు తెర



- **939 పేద కుటుంబాలకు శాశ్వత ఇళ్ల పట్టాలు**
- **నెల్లూరులో సర్వేపల్లి కట్ట ఇళ్ల పట్టాల పంపిణీని వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు**
- **రూ.600 కోట్ల విలువైన 22.31 ఎకరాల భూమిపై పేదలకు హక్కులు**
- **701 మంది మహిళల పేరిట పట్టాలు... మహిళా సాధికారతకు పెద్దపీట**
- **వచ్చే సంక్రాంతిలోగా నెల్లూరులో మరో 4వేల ఇళ్ల పట్టాల పంపిణీకి సీఎం ఆదేశం**
- **రాష్ట్రవ్యాప్తంగా పేదలకు భద్రత, ఆత్మగౌరవం, ఆస్తి లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన**

అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా నివసిస్తున్న పేద కుటుంబాలకు శాశ్వత హక్కులు కల్పిస్తూ వారి సొంతింటి కలను సాకారం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. నెల్లూరులోని సర్వేపల్లి కట్టలో 22.31 ఎకరాల భూమిపై 939 కుటుంబాలకు శాశ్వత ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం అమరావతిలోని క్యాంప్ ఆఫీస్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. సుమారు రూ.600 కోట్ల విలువైన ఆస్తిపై పేదలకు హక్కులు కల్పించామని తెలిపారు. మొత్తం లబ్ధిదారుల్లో 701 మంది మహిళలు ఉండటం మహిళా సాధికారతకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. పట్టాలు అందుకున్న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేసి, ముందస్తుగా దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఎన్నికల ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి పేదలకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం 28 నెలల పాలనలో ఆచరణలో చూపిస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధితో పాటు సుపరిపాలనకు నాంది పలికామని, పేద కుటుంబాలకు శాశ్వత ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం సుపరిపాలనలో భాగమని చెప్పారు. పేదల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు.

**పేదలకు భద్రత, ఆత్మగౌరవం, శాశ్వత ఆస్తి**

ప్రభుత్వ స్థలాల్లో దశాబ్దాలుగా నివసిస్తున్న పేదలకు భద్రత కల్పించడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక ఉద్యమంలా పేదలకు శాశ్వత ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని చెప్పారు. విశాఖపట్నం, విజయవాడ, మంగళగిరి ప్రాంతాల్లో 60వేల కుటుంబాలకు రూ.52వేల కోట్ల విలువైన ఆస్తిని ఇళ్ల పట్టాల రూపంలో అందించామని వెల్లడించారు. 'ప్రతి ఒక్కరికీ భద్రత, ఆత్మగౌరవం, ఒక ఆస్తి సమకూరాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో పట్టాలు పొందేందుకు డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితులు ఉండేవని, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా ఎలాంటి అవకతవకలు లేకుండా పేదలకు పట్టాలు అందిస్తున్నామని తెలిపారు. నెల్లూరు నగరంలో ఇప్పటి వరకు రూ.900 కోట్ల విలువైన 2,600 ఇళ్ల పట్టాలను పేదలకు అందించామని కలెక్టర్ హిమాన్షు శుక్లా వివరించారు. వచ్చే సంక్రాంతి నాటికి మరో 4వేల పేద కుటుంబాలకు శాశ్వత ఇళ్ల పట్టాలు అందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. గత ఏడాది భగత్‌సింగ్ కాలనీలో 1,407 కుటుంబాలకు 36 ఎకరాల భూమిపై పట్టాలు పంపిణీ చేసిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు.

**ఇళ్ల స్థలాలతో పాటు మౌలిక వసతులు**

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇంటర్నెట్ సదుపాయం, మరుగుదొడ్లు, రహదారులు, డ్రైనేజీ వంటి సదుపాయాలను ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణాలు, గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి సుమారు రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ అందించేలా కార్యాచరణ చేపట్టామన్నారు. పల్లెల నుంచి పట్టణాలకు వలసలు పెరుగుతున్న నేపథ్యంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా పట్టణాల్లో మౌలిక వసతులను మరింత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణాలను గ్రోత్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను పెంచుతున్నామని చెప్పారు.

**సంక్షేమ పథకాల అమలులో రాజీ లేదు**

సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా రాజీ పడట్లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతినెలా సామాజిక పింఛన్ల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ 'తల్లికి వందనం' పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. 'స్త్రీ శక్తి' ఉచిత ప్రయాణ పథకం ద్వారా మహిళలు ఇప్పటికే 100 కోట్ల ప్రయాణాలు చేయడం సంతృప్తి ఇచ్చిందన్నారు. దీపం-2 పథకం కింద లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తామని తెలిపారు. విద్యుత్ చార్జీలను ఒక్క రూపాయి కూడా పెంచలేదని, ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. అన్నదాత సుఖీభవ, నేతన్న సేవలో, మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ సేవలో వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గీత కార్మికులకు ఎక్సైజ్ దుకాణాలు, వడ్డెరలకు మైనింగ్ లీజులు ఇచ్చి వారి జీవనోపాధికి తోడ్పడుతున్నామని చెప్పారు.

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

అన్నింటికీ మించి రాష్ట్రంలో పేదలకు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. బుర్రిపాలెం నుంచి ఇటీవలే 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, ఇప్పటికే 28 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో 5.50 లక్షల ఇళ్లను అందించామని చెప్పారు. ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్లు అందరికీ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవల ప్రకాశం జిల్లాలో గర్భకండ్రిక భూముల సమస్యకు పరిష్కారం చూపామని తెలిపారు. భూముల విషయంలో ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకుండా హక్కులను పరిరక్షిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం రీ సర్వే పేరుతో పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మలను వేసుకుందన్నారు. వాటి స్థానంలో ఇప్పుడు ప్రభుత్వం రాజముద్రతో, అత్యంత భద్రతా ప్రమాణాలతో పాస్ పుస్తకాలను అందిస్తున్నట్టు తెలిపారు. సరిహద్దు రాళ్లపై గతంలో ముద్రించిన బొమ్మలను సైతం తొలగించామని చెప్పారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజలకు ఉపశమనం కలిగించామన్నారు.

**ఆర్థిక అసమానతలను తగ్గించడమే లక్ష్యం**

రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయడమే లక్ష్యంగా పీ4 వంటి కార్యక్రమాలను తీసుకొచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆర్థిక అసమానతలను తగ్గించి సమాజంలోని ప్రతి కుటుంబానికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలన్నదే తమ సంకల్పమని చెప్పారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు మద్దతుగా నిలిస్తే ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో మేయర్లు, చైర్మన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. నీతి, నిజాయితీ, నిస్వార్థంతో పనిచేసే నాయకులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓటు ప్రతి ఒక్కరి జీవితంలో, ప్రతి కుటుంబంలో, రాష్ట్రంలో మార్పునకు కారణమైందని ముఖ్యమంత్రి అన్నారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా గతంలో కంటే రెట్టించిన వేగంతో, ఉత్సాహంతో పనిచేస్తున్నానని తెలిపారు. పేదలకు శాశ్వత ఆస్తి కల్పించడంతో పాటు వారి జీవితాల్లో గౌరవం, భద్రత తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన సమన్వయంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**అవధుల్లేని ఆనందంలో లబ్ధిదారులు**

నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో మంత్రి పి.నారాయణ, కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. మంత్రి నారాయణ లబ్ధిదారులకు శాశ్వత ఇళ్ల పట్టాలను స్వయంగా అందజేశారు. దశాబ్దాల నిరీక్షణకు తెరదించి పట్టాలు అందించిన ముఖ్యమంత్రికి మంత్రి నారాయణ, లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఇళ్ల పట్టాలు అందుకోవడంతో దసరా పండుగ ముందుగానే వచ్చిందని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమకు ఎంతో తోడ్పాటునిస్తున్నాయని తెలిపారు. లబ్ధిదారుల ఆనందానికి హద్దులు లేవని మంత్రి నారాయణ ముఖ్యమంత్రికి వివరించారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.







చైతన్యరథం



# ఇదిగో మా నియోజకవర్గ అభివృద్ధి

**సీఎంకు అందజేసిన ఉరవకొండ ఎమ్మెల్యే, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్**

అమరావతి (చైతన్యరథం): ఉరవకొండ నియోజకవర్గ అభివృద్ధి పనులను వివరిస్తూ రూపొందించిన పుస్తకాన్ని ఎమ్మెల్యే, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సీఎం చంద్రబాబుకు అందించారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలో జరిగిన సమగ్ర అభివృద్ధిని వివరిస్తూ పుస్తకాన్ని ప్రచురించినట్టు మంత్రి తెలిపారు. నియోజకవర్గ ప్రోగ్రెస్ కార్డులా ఆయా శాఖల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను క్లుప్తంగా వివరిస్తూ ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారు. ఉరవకొండకు తాగునీరు, హంద్రీ-నీవా కాలువ వెడల్పుతో జరిగిన లబ్ధి, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, పల్లెల్లో సిమెంట్ రోడ్లు, నూతన భవనాల మంజూరు వంటి కార్యక్రమాలను ఇందులో వివరించారు. రెండేళ్లలో గ్రామ స్థాయిలో తీసుకొచ్చిన అన్ని మార్పులను ఇందులో పొందుపరిచినట్టు కేశవ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేయడంతో పాటు....ఆయా పనుల వివరాలను కూడా నిత్యం ప్రజలకు వివరించాలని సీఎం ఈ సందర్భంగా సూచించారు. గత ప్రభుత్వంలో విధ్వంసానికి, కూటమి ప్రభుత్వంలో వికాసానికి మధ్య తేడాను వివరించేలా ఎమ్మెల్యేలు ఈ తరహా నివేదికలను, ప్రోగ్రెస్ కార్డులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు, లిఫ్ట్ ప్రాజెక్టులు మంజూరు చేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రికి మంత్రి కేశవ్ ధన్యవాదాలు తెలిపారు.

# బీసీలకు 40% సీట్లు

- 'జయహో బీసీ.. జనాభాలో సగం, కూటమి ఇచ్చింది బలం' నినాదంతో ప్రచారం
- స్థానిక ఎన్నికల్లో 'ట్రిపుల్ ఇంజన్' సర్కార్ సాధనే లక్ష్యం
- రాబోయే 50 రోజులు ప్రతి ఒక్కరూ కష్టపడాలి
- ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- పనితీరు ఆధారంగా నేతలకు రేటింగ్
- వర్చువల్ సమీక్షలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించి రాష్ట్రంలో 'ట్రిపుల్ ఇంజన్ సర్కార్' స్థాపించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జిలు, పరిశీలకులు, ముఖ్య నేతలతో ఆదివారం ఆయన ప్రత్యేక వర్చువల్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యూహాలు, ప్రచార తీరు, మిత్రపక్షాల సమన్వయం, ప్రత్యర్థుల దుష్ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టడంపై నేతలకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిటీ సిఫార్సులను ఆమోదించి, ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలకు భంగం కలగకుండా బీసీలకు గరిష్ట న్యాయం చేస్తున్నామని తెలిపారు. రాజ్యాంగబద్ధమైన కేటాయింపులతో పాటు పార్టీపరంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 40 శాతం వరకు సీట్లు ఇచ్చేలా కసరత్తు చేస్తున్నట్టు ప్రకటించారు. "జయహో బీసీ! జనాభాలో సగం.. కూటమి ఇచ్చింది బలం" అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి తీవ్ర అన్యాయం చేసిందని, చివరికి ఎన్నికలు జరగకుండా కోర్టులకు వెళ్లి అడ్డుపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

"కేంద్ర, రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి వేగవంతమైంది. స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించి 'ట్రిపుల్ ఇంజన్' పాలన తీసుకురావాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. 2024 అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ ఓటింగ్ శాతం సాధించడమే లీడర్ల పనితీరుకు కొలమానమని తేల్చి చెప్పారు. రాబోయే 50 రోజులు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, నేతల పనితీరు ఆధారంగా ప్రత్యేక రేటింగ్‌లు ఇస్తామని వెల్లడించారు. గెలుపు, నిజాయితీ, సమర్థత, సోషల్ రీ-ఇంజనీరింగ్ ప్రాతిపదికన మాత్రమే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని, స్వార్థం లేదా నాటకాలతో పార్టీకి నష్టం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

టీడీపీ, జనసేన, బీజేపీ భాగస్వామ్యపక్షాలు క్షేత్ర స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పూర్తి సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు ఆదేశించారు. అన్ని స్థాయిల్లోనూ సమన్వయ కమిటీలను క్రియాశీలకం చేయాలని, చిన్నపాటి అపోహలకు కూడా తావివ్వకూడదని స్పష్టం చేశారు. 'కూటమి ప్రభుత్వం రూ. 1.50 లక్షల కోట్లు సంక్షేమానికి, మరో రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధి పనులకు వెచ్చించింది. 'సూపర్‌సిక్స్' హామీలను సూపర్ హిట్‌గా అమలు చేసింది. చెత్త పన్ను రద్దు, 'పల్లె పండుగ' కింద రూ.11వేల కోట్లు, జల్‌జీవన్ మిషన్‌కు రూ.30వేల కోట్లు కేటాయించాం. 5 లక్షల ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు, భోగాపురం ఎయిర్‌పోర్ట్ పూర్తి చేయడం, 16.48 లక్షల ఎకరాలను 22 (ఎ) నిషేధిత జాబితా నుంచి తొలగించడం లాంటి అంశాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి. విశాఖ, విజయవాడ, మంగళగిరి ప్రాంతాల్లో రూ.52వేల కోట్ల విలువైన ఆస్తులపై 60వేల మందికి పూర్తి హక్కులతో పట్టాలు ఇచ్చాం' అని గుర్తు చేశారు.

వైసీపీ గ్రాఫ్ పూర్తిగా పడిపోవడంతోనే ఆ పార్టీ నేతలు అబద్ధాలు, ఫేక్ ప్రచారాలను నమ్ముకున్నారని చంద్రబాబు ఎద్దేవా చేశారు. "వైసీపీ పాలనలో అక్రమ సంపాదన, అనాలోచిత నిర్ణయాల వల్ల ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వ్యాపారవేత్తలు సైతం జైళ్లపాలయ్యారు. వివేకా హత్య కేసులో అంతిమ లబ్ధిదారు ఎవరో ప్రజలందరికీ తెలుసు. అభివృద్ధి నిరోధకులకు, రౌడీలకు, 'రప్పారప్పా' ముఠాలకు ఈ ఎన్నికలతో ప్రజలే గట్టి బుద్ధి చెప్పాలి" అని చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# ఇంటికో మహిళా వ్యాపారవేత్త.. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- పురపాలక మంత్రి నారాయణ ఉద్ఘాటన
- నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్ వార్షికోత్సవంలో మంత్రి నారాయణ దంపతుల సందడి
- వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా నెల్లూరు అభివృద్ధి ఆగబోదన్న మంత్రి



నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు మైపాడు గేట్ సెంటర్‌లో ఆదివారం అత్యంత వైభవంగా జరిగిన స్మార్ట్ స్ట్రీట్ 1వ వార్షికోత్సవ వేడుకల్లో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తన సతీమణి రమాదేవితో కలిసి ఘనంగా కేక్ కట్ చేశారు .గతేడాది సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించిన ఈ 120 షాపుల ప్రాజెక్ట్ కోసం తన సొంత నిధులు 1.2 కోట్లు అందించానని వెల్లడించిన మంత్రి, త్వరలోనే ఇక్కడ పార్క్, అడ్వెంచర్స్, ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటుతో పాటు, మరో ప్రాంతంలో 100 షాపులతో కొత్త స్మార్ట్ బజార్ నిర్మిస్తామని, ఇంటికో మహిళను వ్యాపారవేత్తగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తుంటే వైఎస్ఆర్‌సీపీ అసత్య ప్రచారాలు, కుట్రలతో ఓర్వలేకపోతోందని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా నెల్లూరు అభివృద్ధి ఆగదని మంత్రి హెచ్చరించారు. స్మార్ట్ స్ట్రీట్ తన భర్త మానస పుత్రిక అని, ఆయన మాటల మనిషి కాదు చేతల మనిషి అని రమాదేవి కొనియాడారు.

కార్యక్రమంలో చిన్నారుల అద్భుతమైన చతుర్విధ హావభావ నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకోగా విజేతలకు బహుమతులు అందజేశారు..ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, నగర పార్టీ అధ్యక్షుడు మామిడాల మధు, మాజీ జెడ్పీటీసీ విజేత రెడ్డి, స్మార్ట్ స్ట్రీట్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు



# కనకదుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

**ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**

అమరావతి (చైతన్యరథం): దుష్టశక్తులపై దైవశక్తి, అధర్మంపై ధర్మం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా పండుగ. శరన్నవరాత్రుల్లో అమ్మవారిని తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఆరాధించడం మన సంప్రదాయంలో ఎంతో విశిష్టమైనది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలి. అమ్మవారి కరుణాకటాక్షాలతో ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా వర్ధిల్లాలి. ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలి. ప్రజలందరికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను.' అంటూ రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దసరా శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలియజేశారు.

# గిరిజనాభివృద్ధికి మహత్తర యజ్ఞం

**డిప్యూటీ సీఎం పవన్‌కు సీఎం చంద్రబాబు అభినందనలు**



అమరావతి (చైతన్యరథం): 'గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించి, డోలీ మోతలకు చరమగీతం పాడేలా 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముందుకు తీసుకెళ్తున్నారు. తొలి దశను విజయవంతంగా పూర్తి చేసి ఇప్పుడు 'అడవితల్లి బాట 2.0' ద్వారా మరో 1,341 ఆవాసాలకు రూ.2,052 కోట్లతో 1,976 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషకరం. ఇది కేవలం రహదారుల నిర్మాణం మాత్రమే కాదు... గిరిజనుల కష్టాలకు విముక్తి, అత్యవసర వైద్య సేవలకు భరోసా. ప్రతి గిరిజన గూడెం రహదారితో అనుసంధానమై అభివృద్ధి ఫలాలను అందుకునేలా సాగుతున్న ఈ మహత్తర యజ్ఞం మరింత విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను.' అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# గొడ్డలి పార్టీకి దెబ్బకొట్టాలి

# 'స్థానికం'లో కూటమే గెలవాలి

- గెలిచే అభ్యర్థులకే టికెట్లు
- మిత్రపక్షాలతో పక్కా సమన్వయం ఉండాలి
- టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు
- ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలతో ప్రత్యేక టెలీకాన్ఫరెన్స్

అమరావతి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందడుగు వేయాలని ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు, బూత్ కమిటీలు, గ్రామస్థాయి కార్యకర్తలతో ఆదివారం ఆయన ప్రత్యేక టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోరులో అభ్యర్థుల ఎంపిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కూటమి భాగస్వామ్యపక్షాలైన జనసేన, బీజేపీలతో సమన్వయం తదితర అంశాలపై సుదీర్ఘంగా దిశానిర్దేశం చేశారు.



**తీసిన గొయ్యిలో వారే పడ్డారు**

సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... "స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకోవాలని 'గొడ్డలి పార్టీ' కోర్టులను ఆశ్రయించింది. కానీ అన్ని అడ్డంకులను అధిగమించి కోర్టు ఆదేశాల మేరకే మనం ఎన్నికలు నిర్వహిస్తున్నాం. ఈ ఎన్నికల్లో కూటమి కొట్టే దెబ్బతో గొడ్డలి పార్టీ శాశ్వతంగా మూతపడటం ఖాయం. 2024 అసెంబ్లీ ఎన్నికల నాటి స్ఫూర్తిని మళ్లీ ప్రదర్శించాలి. ఆనాటి కంటే మరింత కసితో ప్రతి ఒక్కరూ పనిచేయాలి" అన్నారు.

కూటమి ధర్మం చాలా ముఖ్యం

"మనం కూటమి ప్రభుత్వంలో ఉన్నాం.. అందుకే మిత్ర ధర్మం పాటించడం అత్యంత ముఖ్యం. జనసేన, బీజేపీ నేతలను కలుపుకొని ముందుకెళ్లాలి. నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఆయా పార్టీల నేతలతో వెంటనే సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి" అని సీఎం స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపికపై తేల్చిచెప్త... "వ్యక్తిగత పంతాలు, పట్టింపులకు పోతే అసలు లక్ష్యం దెబ్బతింటుంది. సర్వేలు, క్షేత్రస్థాయి బలాన్ని బట్టి ఎవరైతే కచ్చితంగా గెలుస్తారో వారికే సీట్లు కేటాయిస్తాం. ఎమ్మెల్యేలు కార్యకర్తల మనోభావాలను గౌరవిస్తూ కార్యక్రమాలు రూపొందించుకోవాలి" అని సూచించారు.

**అభివృద్ధి, సంక్షేమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి**

తెలుగుదేశం పార్టీకి బీసీలు ఎల్లప్పుడూ వెన్నెముకగా ఉన్నారని, అందుకే వారికి 34 శాతం కంటే అదనంగా స్థానాలు కేటాయిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తున్నాం కాబట్టి ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్లి ఓటు అడిగే హక్కు మనకే ఉంది. మనం చేసిన మంచిని ప్రతి ఒక్కరికీ వివరించాలి. ఓటరు జాబితాలను క్లస్టర్ల వారీగా సిద్ధం చేసుకుని, ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాలను వివరించాలి. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి చిన్న చిన్న తప్పిదాలకూ తావివ్వకూడదు" అని శ్రేణులను హెచ్చరించారు. ప్రభుత్వ పాలనతో సమానంగా పార్టీ కార్యక్రమాలనూ నడిపిస్తున్నానని, ఇప్పటికే 59 నియోజకవర్గాల కార్యకర్తలతో నేరుగా సమీక్షలు పూర్తి చేశానని వెల్లడించారు. ఎప్పుడు ఏ ఎన్నిక వచ్చినా కూటమిదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

రంపచోడవరం (చైతన్యరథం): గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామని ఉద్ఘాటించారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వేయటానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. అల్లూరి సీతారామరాజును తాను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్తున్నానని పేర్కొన్నారు. పోలవరం జిల్లా రంపచోడవరం మండలంలోని కాకవాడలో ఆదివారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అడవితల్లి బాట బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వైద్యం కోసం డోలీ మోతలతో వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుందని పవన్ కల్యాణ్ తెలిపారు. వెదురుతో చేసిన వస్తువులకు మార్కెట్‌లో ధర కల్పిస్తామని భరోసా కల్పించారు. ఏడు జిల్లాలకు సంబంధించిన గిరిజన ఆవాసాల్లో రూ.1000 కోట్లతో రహదారులను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రోడ్లను నిర్మిస్తే విద్య, వైద్యం, రవాణాకు ఉపయోగపడతాయని వివరించారు. ఖర్చు కోసం ఆలోచించకుండా రహదారులను తాము నిర్మిస్తున్నామని తెలిపారు. రోడ్డు లేని



గిరిజన గ్రామం.. అభివృద్ధి లేని కుటుంబం ఉండకూడదన్నారు. ఇప్పటికే 753 తండాలకు 1,258 కి.మీ. మేర రోడ్ల నిర్మాణం పూర్తిచేశాం. మార్చి 2028 నాటికి పెండింగ్ రహదారులు పూర్తి చేస్తాం. కాంట్రాక్టర్లు ముందుకు రాకున్నా ఒప్పించి పనులు చేపట్టాం.

ఎన్నికల్లో మాత్రమే రాజకీయాలని.. ఇప్పుడు అభివృద్ధిపైనే దృష్టిసారించామని పవన్ కల్యాణ్ వెల్లడించారు. రూ.7వేల కోట్లతో ఏడు జిల్లాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో రూ.30 వేల కోట్లతో జల్‌జీవన్ పనులు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అపార అనుభవంతో రాష్ట్రాన్ని నడుపుతున్నారని కొనియాడారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే ఆయా గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బలం ఇస్తే.. మరింత అభివృద్ధి చేస్తాం. పొత్తు ప్రకారం స్థానిక ఎన్నికల్లో జనసేన పోటీ చేస్తుంది. కూటమి నేతలకు ప్రజలంతా సంపూర్ణ మద్దతిచ్చి గెలిపించాలని పవన్ కల్యాణ్ పిలుపు ఇచ్చారు.



సుప్రీం తీర్పును గౌరవిస్తూనే..

## పార్టీ పరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు

- నాడు రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి జగన్ ద్రోహం
- బీసీల రాజకీయ సాధికారత, సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయం
- మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

సింగరాయకొండ (చైతన్యరథం): బీసీల రాజకీయ సాధికారతకు, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండల టీడీపీ కార్యాలయంలో బీసీ సోదరులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మంత్రి డా.స్వామి మాట్లాడుతూ....బీసీలకు రాజ్యాధికారం కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. నాడు జగన్ బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 24 శాతానికి తగ్గించి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో 16,800 మందికి రాజకీయ పదవులు దూరం చేశారన్నారు. నేడు టీడీపీ బీసీలకు మళ్ళీ 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే జగన్ అండ్ కో కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారన్నారు. బీసీలు రాజకీయంగా ఎదగకూడదనే గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. గొడ్డలి పార్టీ 5 ఏళ్ల పాలనలో బీసీలపై నిత్యం దాడులు, దౌర్జన్యాలకు తెగబడ్డారన్నారు. టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ స్వాతంత్రం లభించిందన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్‌పై టీడీపీ కట్టుబడి ఉందని సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే పార్టీ పరంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తెలిపారు. పంచాయతీ వార్డుల్లో బీసీలకు 26.73 శాతం సీట్లు, సర్పంచ్‌లు 27.95%, వీటాలు 24.6% సీట్లు,గ్రాజలు 24.6%,గ్గా చైర్మన్లు 23.08% సీట్లు, మున్సిపల్ చైర్మన్లు 33.02%, అర్బన్ వార్డుల్లో 32.78%, మేయర్లు బీసీలకు 35.29% సీట్లు ఇచ్చేందుకు తెలుగుదేశం సిద్ధంగా ఉందని మంత్రి డా.స్వామి తెలిపారు.

# అభివృద్ధిలో ఆదర్శంగా మచిలీపట్నం

- ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యం
- మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ
- బందరులో 11వ రోజూ కొనసాగిన మంత్రి పాదయాత్ర
- ప్రజలను పరామర్శిస్తూ, సమస్యలు తెలుసుకుంటూ సాగిన యాత్ర

మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దటమే తన లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం 32, 33, 34 డివిజన్ల పరిధిలో ఆదివారం మంత్రి పాదయాత్రకు జనం బ్రహ్మరథం పట్టారు. మహిళలు పూలహారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి పనులు కొంచెం కూడా ముందుకుసాగలేదన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మచిలీపట్నంలో నేడు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. దశాబ్దాలుగా బందరు ప్రజలు కోరుకుంటున్న పోర్టు పనులు త్వరలోనే పూర్తి చేయబోతున్నాం. 160 సంవత్సరాల తర్వాత బందరుకి షిప్స్ రాబోతున్నాయి. మరోవైపు బందరు పోర్టు కేంద్రంగా గోవా షిప్ యార్డ్ సంస్థ ఏర్పాటు



కాబోతోంది. రూ.8000 కోట్ల పెట్టుబడితో 10వేల మందికి ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు కల్పించనున్నాం. దానికి అనుబంధంగా మరో రూ.10 వేలంకోట్ల విలువైన పెట్టుబడులు రాబోతున్నాయి. బందరులో పర్యాటకాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో గత సంవత్సరం బీచ్ ఫెస్టివల్, ఈ ఏడాది మహా గణపతి ఉత్సవాలు నిర్వహించాం. ఎవరు ఎన్ని ఆటంకాలు సృష్టించినా.. ఎన్ని అవరోధాలు కల్పించినా బందరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా తీర్చి దిద్దడమే తన లక్ష్యం అని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం





## ఇంద్రకీలాద్రి శరన్నవరాత్రి ఉత్సవాలను

# గ్రాండ్ సక్సెస్ చేయాలి



- రేపటి నుంచి నిర్వహించే సరస్ మేళా దేశానికి ఆదర్శంగా నిలవాలి
- విజయవాడ ఉత్సవ్ 2.0లో సెలబ్రేషన్, ట్రెడిషన్ ఉండాలి
- వరుస కార్యక్రమాలను దేవాదాయ శాఖ, పర్యాటక శాఖ, జిల్లా యంత్రాంగం కలిసి విజయవంతం చేయాలి
- ఆయా శాఖల అధికారులు, మంత్రులతో సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి (చైతన్యరథం): విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలను గ్రాండ్ సక్సెస్ చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. ఇందుకు దేవాదాయ శాఖ, పర్యాటక శాఖ, జిల్లా యంత్రాంగం కలిసి పనిచేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు, పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు తరలివస్తున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. వీఐపీల రాక కారణంగా సామాన్య భక్తులు ఇబ్బందిపడకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దసరా సామాన్యుల దసరాగా ఉండాలి... వీఐపీ దసరాగా కాదు... అన్ని వర్గాలు దీనికి సహకరించాలి. ఉన్నత స్థాయిలో అధికారులు తీసుకునే నిర్ణయాలకు అంతా సహకరించాలని సూచించారు. దర్శనాలు, సౌకర్యాలకు సంబంధించి తీసుకుంటున్న నిర్ణయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. వీఐపీల రాక కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తే... ఆ సమయంలో ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు తగ్గించే వ్యూహాలను అమలు చేయాలన్నారు. మరోవైపు టూరిజం శాఖ కూడా విజయవాడ ఉత్సవ్ 2.0ను విజయవంతం చేయాలని చెప్పారు. మన సంస్కృతి, సంప్రదాయాలు చాటేలా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాన్ని ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలన్నారు. దసరా సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొనేలా చూడాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు, పర్యాటకులు, ప్రజలతో ఈ ప్రాంతంలో ఎకనమిక్ యాక్టివిటీ పెరుగుతుందని సీఎం అన్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు జరగాలన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దుర్గమ్మ దర్శనానికి, సరస్ మేళాకు హాజరవుతున్న నేపథ్యంలో ఆమె పర్యటనపైనా చర్చించారు. దేశవ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల ఉత్పత్తులు ప్రదర్శించేలా 'జాతీయ సరస్ మేళా-2026'ను విజయవాడలోని పున్నమి ఘాట్‌లో ఈ నెల 13 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చే మహిళా పారిశ్రామికవేత్తల కోసం 576 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. మన రాష్ట్రం నుంచి 208 స్టాళ్లు మేళాలో పెడుతున్నారు. ఏపీ ఎస్‌హెచ్‌జీ మహిళలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు 'స్వయం ఏపీ' బ్రాండ్ కింద తమ ఉత్పత్తులను జాతీయ స్థాయిలో ప్రదర్శించి, విక్రయించేందుకు ఈ మేళా వేదిక కావాలని సీఎం ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు, ఎన్టీఆర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## కనకదుర్గమ్మ ఆశీస్సులతో అందరూ సుఖంగా ఉండాలి

### - మంత్రి నారా లోకేష్

అమరావతి (చైతన్యరథం): 'కృష్ణా నదీ తీరాన ఇంద్రకీలాద్రి శరన్నవరాత్రి ఉత్సవాల శోభతో అలరారుతోంది. భక్తులను ఎల్లవేళలా కాపాడే బెజవాడ కనకదుర్గమ్మ తొమ్మిది రోజులు తొమ్మిది అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనుంది. రాష్ట్రవ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న దుర్గాదేవి మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కనకదుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలి' అంటూ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.







## కనకదుర్గమ్మను దర్శించుకున్న రామ్మోహన్‌నాయుడు, అనిత





విజయవాడ (చైతన్యరథం): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత శ్రీకనకదుర్గమ్మవారిని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆదివారం దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి జగన్మాత ఆశీస్సులు పొందారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని, యువతకు మెరుగైన భవిష్యత్తు లభించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు వారు తెలిపారు. ప్రజా ప్రతినిధులకు ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం చేయించి వేదాశీర్వచనం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

# కళ్లున్న కబోధిలా జగన్ తీరు

- రైతుల పేరుతో రాజకీయాలు మానాలి
- పంట కొనుగోళ్లకు రూ.1,944.43 కోట్ల నిధుల విడుదల కనిపించదా?
- 1,50,747 మంది రైతుల నుంచి 2,84,045.60 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తుల కొనుగోళ్లు
- అధికారిక లెక్కలను దాచిపెట్టి కూటమి ప్రభుత్వంపై జగన్, సాక్షి విషప్రచారం
- ఆగస్ట్ 17నే ఖరీఫ్ కొనుగోళ్ల ప్రతిపాదన.. సెప్టెంబరు 23న కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ లేఖ
- సకాలంలో చెల్లింపుల కోసం 15 శాతం రివాల్వింగ్ ఫండ్, రూ.300 కోట్ల ఆర్థిక సహాయం ప్రతిపాదన
- వాస్తవాలపై జగన్ బహిరంగ చర్చకు రావాలి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): రైతులకు మద్దతుగా చేపట్టిన పంట ఉత్పత్తుల కొనుగోళ్లను, అందుకోసం విడుదలైన నిధులను దాచిపెట్టి కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేయడం జగన్‌కు , ఆయన అవినీతి పుత్రిక 'సాక్షి'కి అలవాటుగా మారిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలను విస్మరించి, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదారి పట్టించేందుకు జగన్‌తో పాటు వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కొనుగోళ్ల లెక్కలు ఉన్నాయి.. నిధుల విడుదల వివరాలు ఉన్నాయి.. కేంద్రానికి పంపిన ప్రతిపాదనల తేదీలు ఉన్నాయి. ఇవన్నీ పక్కనపెట్టి ప్రభుత్వంపై నిందలు వేస్తే అబద్ధం నిజమైపోతుందా? అని ప్రశ్నించారు.

2024-25 ఖరీఫ్ నుంచి 2025-26 రబీ వరకు మొత్తం 1,50,747 మంది రైతుల నుంచి 2,84,045.60 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులను కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చెల్లింపులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ ద్వారా ఏపీ మార్క్‌ఫెడ్‌కు మొత్తం రూ.1,944.43 కోట్లు విడుదల చేసిందని వివరించారు. 2024-25లో 71,376 మంది రైతుల నుంచి 1,22,970.60 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను కొనుగోలు చేయగా, అందుకు రూ.821.37 కోట్లు విడుదలయ్యాయని పేర్కొన్నారు. 2025-26లో 79,371 మంది రైతుల నుంచి 1,61,075 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను కొనుగోలు చేయగా, అందుకు రూ.1,123.06 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. కందులు, శనగలు, మినుములు, పెసలతోపాటు ఉల్లిపాయలు, పొగాకుకు సంబంధించిన కొనుగోళ్ల వివరాలు కూడా మార్క్‌ఫెడ్ సమర్పించిన గణాంకాల్లో ఉన్నాయని చెప్పారు.

2024-25 ఖరీఫ్‌లోనే 53,640 మంది రైతుల నుంచి 79,993 మెట్రిక్ టన్నుల కందులను రూ.603.95 కోట్ల విలువకు కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. 2025-26 ఖరీఫ్‌లో 37,058 మంది రైతుల నుంచి 59,296.70 మెట్రిక్ టన్నుల కందులను రూ.474.37 కోట్ల విలువకు కొనుగోలు చేశామని తెలిపారు. అదే ఏడాది రబీలో 32,541 మంది రైతుల నుంచి 83,470.50 మెట్రిక్ టన్నుల శనగలను రూ.490.39 కోట్ల విలువకు, 7,731 మంది రైతుల నుంచి 14,518.90 మెట్రిక్ టన్నుల పెసలను రూ.127.30 కోట్ల విలువకు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఇంత స్పష్టమైన గణాంకాలు ఉన్నా రైతులకు ప్రభుత్వం ఏమీ చేయలేదన్నట్లు చిత్రీకరించడం వెనుక ఉద్దేశం ఏమిటి? రైతులకు జరిగిన మేలును గుర్తించడానికి జగన్‌కు, సాక్షికి మనసు రాదా? అని మంత్రి అచ్చెన్నాయుడు నిలదీశారు.

జగన్ నీచ రాజకీయాలకు రైతులను పావులుగా వాడుకోవడం మానుకోవాలని మంత్రి హెచ్చరించారు. వైసీపీ పాలన గురించి గొప్పలు చెప్పుకునే ముందు, కూటమి ప్రభుత్వం చేపట్టిన కొనుగోళ్ల లెక్కలను చూడండి. ప్రభుత్వంపై విమర్శలు చేయాలంటే వాస్తవాలతో చేయాలి. మీకు అనుకూలమైన కథనం కోసం వాస్తవాలను తొక్కిపెట్టే హక్కు ఎవరిచ్చారు? అబద్ధానికి పెద్ద శీర్షిక పెట్టినంత మాత్రాన అది నిజం కాదు. రైతుల పేరుతో ప్రభుత్వంపై బురద చల్లడం రైతు సేవ అనిపించుకోదు. జగన్, వైసీపీ నేతలు రైతు సంక్షేమంపై చర్చకు వస్తే అధికారిక గణాంకాలతోనే సమాధానం చెబుతాం అని మంత్రి స్పష్టం చేశారు.

**సకాలంలో మార్క్‌ఫెడ్ చర్యలు**

ఖరీఫ్-2026 కొనుగోళ్ల విషయంలోనూ మార్క్‌ఫెడ్ సకాలంలో చర్యలు తీసుకుందని అచ్చెన్నాయుడు తెలిపారు. పీఎం-ఆశా ధరల మద్దతు పథకం మార్గదర్శకాలు, కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మే 20న జారీ చేసిన సూచనలకు అనుగుణంగా ఆగస్ట్ 17నే రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర కొనుగోలు ప్రతిపాదన సమర్పించినట్లు వివరించారు. రైతులకు నిర్దేశిత గడువులో చెల్లింపులు జరిగేలా, అంచనా ఉత్పత్తి/అనుమతించే కొనుగోలు పరిమాణానికి సంబంధించిన కనీస మద్దతు ధర విలువలో కనీసం 15 శాతానికి సమానమైన రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేసి అమల్లోకి తేవాలని కోరినట్లు తెలిపారు. కొనుగోళ్లకు సంబంధించిన అనుబంధ వ్యయాలకు కూడా నిధులు సమకూర్చాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. కేంద్ర నోడల్ సంస్థల నుంచి నిధులు/రీయింబర్స్‌మెంట్ అందేలోపు కొనుగోళ్లు నిరాటంకంగా కొనసాగేందుకు, అర్హులైన రైతులకు తక్షణమే ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసేందుకు ధరల స్థిరీకరణ నిధి/వర్కింగ్ క్యాపిటల్ సహాయంగా రూ.300 కోట్లు మంజూరు చేయాలని మార్క్‌ఫెడ్ కోరినట్లు మంత్రి తెలిపారు. రైతులకు చెల్లింపుల్లో జాప్యం రాకుండా ముందస్తు నిధుల కోసం ప్రతిపాదించడం బాధ్యతాయుతమైన చర్య. రైతులకు సకాలంలో డబ్బు అందాలనే ఉద్దేశంతో తీసుకున్న చర్యలను కూడా నిర్వాకంగా చిత్రీకరించడం సాక్షి వక్రీకరణకు నిదర్శనం అని విమర్శించారు.

మార్క్‌ఫెడ్ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 23 న కేంద్ర ప్రభుత్వానికి పంపి, ఖరీఫ్-2026 కొనుగోళ్లకు అనుమతి కోరినట్లు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కందులు, పెసలు, మినుములు, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న, రాగులు, కొర్రలు, వేరుశనగలను ఈ ప్రతిపాదనలో చేర్చినట్లు తెలిపారు. రైతులు తక్కువ ధరలకు పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితిని నివారించి, కనీస మద్దతు ధర ద్వారా ఆదుకోవడమే ఈ ప్రతిపాదన లక్ష్యమన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఆమోద ఉత్తర్వులు రావాల్సి ఉందని వెల్లడించారు.

ఆగస్టులో మార్క్‌ఫెడ్ ఇచ్చిన ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరులో కేంద్రానికి పంపింది. ఇప్పుడు కేంద్ర అనుమతి రావాల్సి ఉంది. ఈ ప్రక్రియను దాచిపెట్టి రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయలేదన్నట్లు కథనం రాయడం రైతులను తప్పుదారి పట్టించడమే. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల పంటకు మద్దతు ధర, సకాలంలో చెల్లింపుల కోసం పనిచేస్తోంది. జగన్, వైసీపీ అసత్య ప్రచారానికి అధికారిక రికార్డులతోనే సమాధానం ఇస్తాం. రైతుల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలను సహించబోమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# చదువుతోనే జీవితంలో సమూల మార్పు

- మంత్రి నిమ్మల రామానాయుడు ఉద్ఘాటన
- పూలపల్లి సంధ్య మెరైన్స్ సీఎస్ఆర్ నిధులతో 198 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేత



పాలకొల్లు (చైతన్యరథం): ప్రపంచంలో ప్రతి ఒక్కరి జీవితాన్ని, తలరాతను మార్చే శక్తి ఒక్క చదువుకు మాత్రమే ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు బ్రాడీపేట అల్లు వెంకట సత్యనారాయణ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంతంలో 6-9 తరగతుల విద్యార్థులు 198 మందికి పూలపల్లి సంధ్య మెరైన్స్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో ఉచిత సైకిళ్లను సంస్థ డైరెక్టర్ కే. అరుణ్ కుమార్‌తో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం అందజేశారు. ముందుగా మంత్రి రామానాయుడు, అరుణ్ కుమార్ లకు పాఠశాల తరపున ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. సైకిళ్లను స్వయంగా అందజేసిన మంత్రి విద్యార్థులతో మమేకమవుతు సైకిల్ తొక్కి అందర్నీ ఉత్సాహపరిచారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ చదువుకుంటే రిక్షా కార్మికుడు కుమారుడు కలెక్టర్, సాధారణ పని చేసుకునే వారి పిల్లలు సాఫ్ట్వేర్ రంగంలో రాణించవచ్చున్నారు. చిన్నపాటి గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన తాను కూడా పీహెచ్డీ ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారానే నాడు అధ్యాపకునిగా, నేడు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈ స్థాయికి ఎదిగానని మంత్రి రామానాయుడు తెలిపారు. చదువు విషయంలో పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. సేవా కార్యక్రమాల గురించి వివరిస్తూ అందులో పొందే ఆనందం, తృప్తి మరి ఎక్కడ ఉండదన్నారు. ఆ ఉద్దేశంతోనే తన తండ్రి పేరుతో ధర్మారావు ఫౌండేషన్ ఏర్పాటుచేసి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థిని విద్యార్థులందరికీ ఉచితంగా సైకిలను అందజేయాలని మొదట అనుకున్నా తనకు సంస్థలు, ఇతర కంపెనీలు అందిస్తున్న సహకారంతో 6 నుంచి పదో తరగతి వరకు అందరికీ దశలవారీగా అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నానన్నారు. అందులో భాగంగానే ఈ పాఠశాల విద్యార్థులకు ఉచిత సైకిళ్లతో పాటు గోరింటాడలో స్మశాన వాటిక అభివృద్ధి పనులకు పూలపల్లి సంధ్య మెరైన్స్ వారి సీఎస్ఆర్ నిధులు రూ 25 లక్షలు అందజేశారని, అందుకు ఆ సంస్థ ఎండి కే ప్రసాద్, ఆయన కుమారులైన డైరెక్టర్లు అరుణ్ కుమార్, ఆనంద్ కుమార్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**అభివృద్ధిపైనే దృష్టి**

గత టీడీపీ ప్రభుత్వంలో పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో మొదటి స్థానంలో నిలపగా వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇరవై ముప్పై ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వంలో అగ్రస్థానంలో నిలిపేలా ప్రతిరోజు, ప్రతిక్షణం నిధులు కోసం శ్రమిస్తున్నానని ఫలితంగా అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.1500 కోట్లు వరకు తీసుకువచ్చానన్నారు. ఇటు మంత్రిగా, అటు పార్టీ కార్యక్రమాల్లో క్షణం తిరిగి లేకుండా ఉన్నప్పటికీ పాలకొల్లు నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన అజెండాగా పనిచేస్తున్నానని చెప్పారు. పాలకొల్లులో గత గొడ్డలి పార్టీ ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన రూ. 200 కోట్ల విజ్జేశ్వరం మంచినీటి పథకం, పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి, విద్యుత్ , టిడ్కో గృహాలు వంటి వాటిని మళ్లీ గాడిలో పెడుతూ ముందుకు తీసుకు వెళ్తున్నానన్నారు.

సంధ్య మెరైన్స్ డైరెక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ మంత్రి నిమ్మల రామానాయుడు తలపెట్టిన విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ మంచి కార్యక్రమం అని అభినందించారు. భవిష్యత్తులోనూ తమ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ ను మంత్రి రామానాయుడు శాలువా కప్పి గజమాలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఎంఈఓ గుమ్మళ్ల వీరాస్వామి, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, కర్నెన గౌరు నాయుడు, ఉన్నమట్ల కబడ్డీ, తుల రామలింగేశ్వరరావు, మీసాల రాము, పొట్నూరి వెంకట రమేష్, కొల్లు పవన్, గంధం సుబ్బారావు, పోలంకి మహేష్, పొట్నూరి శ్రీనివాస్, మహమ్మద్ జానీ, కొల్లికొండ ప్రసాద్, బేరం శ్రీరామచంద్రమూర్తి, కొలుకులూరి జయప్రకాష్, పెనుమజ్జి మురళి, పీతల శ్రీనివాస్, రియా, ముప్పిరి సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం కే గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# బీసీల పక్షపాతి కూటమి ప్రభుత్వం

**- స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎన్టీఆర్, చంద్రబాబు ఘనతే**

**- మంత్రి నిమ్మల రామానాయుడు ఉద్ఘాటన**

పాలకొల్లు (చైతన్యరథం): బీసీల పక్షపాతిగా అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని రాష్ట్ర జలవనుర్ల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజక వర్గం యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామ ఎన్టీఆర్ కాలనీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రూ 41.55 లక్షలతో ఆ కాలనీతోపాటు పలు గ్రామాల్లో ఎన్టీఆర్ కాలనీలకు విద్యుత్ సౌకర్యాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సామాజిక న్యాయం కల్పించేందుకు, 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెదేపా కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో గొడ్డలి పార్టీ న్యాయస్థానాల్లో కేసులు వేసి అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు హయాంలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని, దేశ చరిత్రలో తొలిసారిగా స్థానిక సంస్థల్లో 24 శాతం రిజర్వేషన్ను ఎన్టీఆర్ అమలు చేస్తే చంద్రబాబు 34 శాతానికి పెంచారన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో జగన్ బీసీ రిజర్వేషన్ల కోటా



34 నుంచి 24 శాతానికి తగ్గించడం వలన స్థానిక సంస్థల్లో 16 వేల పోస్టులను కోల్పోయారన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబును అనుసరించి అందరు ముఖ్యమంత్రులు రిజర్వేషన్ అమలు చేస్తే ఒక జగన్ మాత్రమే తగ్గించారన్నాని మంత్రి నిమ్మల విమర్శించారు.

**గొడ్డలి పార్టీకి బుద్ధి చెప్పాలి**

బీసీలు రాజకీయంగా ఎదగకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తుంటే వారి హక్కుల పరిరక్షణకు తెదేపా నిరంతరం కృషి చేస్తుందని నిమ్మల రామానాయుడు తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. బీసీలకు అన్యాయం అంటూ జరిగిందంటే జగన్ వల్లనేననే విషయాన్ని బీసీ సామాజిక వర్గం అంతా గుర్తించి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమాన్ని అందించే దిశగా పనిచేస్తుందన్నారు. దొడ్డిపట్ల ఎన్టీఆర్ కాలనీతోపాటు మరో 15 కాలనీల వరకు గత టీడీపీ ప్రభుత్వంలో ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చామని, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ ఆ కాలనీలో ఎటువంటి మౌలిక సౌకర్యాలు కల్పించలేదని, ముఖ్యంగా విద్యుత్ సౌకర్యం లేక అనేక అవస్థలు అనుభవించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని దిశగా దృష్టి సారించానని, అందులో భాగంగా విద్యుత్ సౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న మంచి కూటమి ప్రభుత్వాన్ని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశీర్వదించాలని మంత్రి రామానాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మామిడి శెట్టి పెద్దిరాజు, చేగొండి రవిశంకర్, బోనం నాని, తోలేటి చంటి, గుబ్బల మోహన్, చేగొండి వెంకటేశ్వరరావు తదితరులతోపాటు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అండ

- **ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు ఆకాంక్ష**
- **పేదల విద్య, వైద్యం ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట**
- **పేదలకు మేలు చేస్తుంటే.. గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోంది**
- **మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

తూర్పు నాయుడుపాలెం/ప్రకాశం (చైతన్యరథం): ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. 89 మంది లబ్ధిదారులకు రూ. 30.60 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక కొండపి నియోజకవర్గం లో ఇప్పటివరకు 2,560 మందికి రూ. రూ.20.37 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైద్యం కోసం పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదని సీఎం చంద్రబాబు పెద్ద మొత్తంలో సీఎంఆర్ నిధులు విడుదల చేస్తున్నారన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆకాంక్ష అని, పేదల విద్య, వైద్యం ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందిన్నారు. పీ4 తో రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు పేదలకు మేలు చేస్తుంటే..గొడ్డలి పార్టీ ఓర్వలేక రాష్ట్రంలో అసత్యాలు, అబద్ధాలు చేస్తోందని మండి పడ్డారు. వైసీపీ ఓ విషవృక్షం, ప్రజలు దాన్ని స్థానిక ఎన్నికల్లో కూకటి వేళ్ళతో పెకిలించాలని, లేకుంటే రాష్ట్రానికి ప్రమాదకరమని మంత్రి డా.స్వామి అన్నారు.



# టీడీపీతోనే బీసీలకు రాజ్యాధికార భరోసా

**- స్థానిక ఎన్నికల్లో సముచిత ప్రాతినిధ్యం లక్ష్యం**

**- పార్టీ పరంగా 34 శాతానికి మించి సీట్లు**

**- బీసీల ఎదుగుదలకు టీడీపీ పునాది**

**- పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు**



అమరావతి (చైతన్యరథం): బీసీలకు రాజ్యాధికారం.. కూటమి ప్రభుత్వ ధ్యేయమని శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పష్టం చేశారు. బీసీల అభ్యున్నతి, రాజకీయ సాధికారత, సామాజిక న్యాయం కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. బీసీలకు విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధితో పాటు రాజకీయంగా సముచిత స్థానం కల్పించేందుకు ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోందని ఆదివారం ఒక ప్రకటనలో ఎమ్మెల్యే గోవిందరావు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తోంది. బీసీల అభ్యున్నతికి ఎంత చేసినా తక్కువేననే భావనతో వారి సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి రంగాల అభివృద్ధితో పాటు రాజకీయ సాధికారతకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే గోవిందరావుచెప్పారు.

**బీసీల రాజకీయ ఎదుగుదలకు టీడీపీ పునాది**

1987లో ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించి, గ్రామస్థాయి నుంచి బీసీ నాయకత్వం ఎదిగేందుకు పునాది వేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తదనంతర ప్రభుత్వాలు సైతం అదే విధానాన్ని కొనసాగించాయని పేర్కొన్నారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి నష్టం జరిగింది. 16,800 మందిని రాజ్యాంగబద్ధమైన పదవులకు దూరం చేసిందని విమర్శించారు.

**కూటమి న్యాయపోరాటం**

2024 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే న్యాయపరమైన సవాళ్లు ఎదురవడంతో హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించి బీసీలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. న్యాయస్థానాల తీర్పుల నేపథ్యంలోనూ ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా, చట్టపరమైన పరిధిలో బీసీలకు సాధ్యమైనంత ఎక్కువ ప్రయోజనం కల్పించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులను అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే నిర్ణయాన్ని మంత్రివర్గం ఆమోదించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను గౌరవిస్తూనే బీసీలకు మరింత ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే గోవిందరావు తెలిపారు.

**స్థానిక సంస్థల్లో బీసీలకు ప్రాధాన్యం**

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం గ్రామీణ స్థానిక సంస్థల్లో గ్రామ వార్డు సభ్యులకు 26.73 శాతం, సర్పంచులకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం, జెడ్పీ చైర్‌పర్సన్లకు 23.08 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల్లో వార్డు సభ్యులకు 32.78 శాతం, మున్సిపల్ చైర్మన్లకు 33.02 శాతం, మేయర్లకు 35.29 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా నిర్ణయం తీసుకుంది. కొన్ని కేటగిరీల్లో చట్టపరమైన పరిమితుల కారణంగా 34 శాతం కంటే తక్కువ రిజర్వేషన్లు అమలవుతున్నప్పటికీ, కూటమి పార్టీల పరంగా ఆ లోటును భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34శాతానికి మించి సీట్లు కేటాయించాలన్న లక్ష్యంతో, 34 శాతానికి మించి ప్రాతినిధ్యం కల్పించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా బీసీలకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

**బీసీల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు**

రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు బీసీ వృత్తుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. వడ్డెర్లకు మైనింగ్ లీజుల్లో 33 శాతం కేటాయింపు, గీత కార్మికులకు ఎక్సైజ్ దుకాణాల్లో 10 శాతం కేటాయింపు, నేతన్నలకు చేయూత, ఉచిత విద్యుత్ పథకాలు, మత్స్యకారుల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. సెలూన్లకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు నెలవారీ భృతిని రూ.25 వేలకు పెంచడం వంటి చర్యలు సంప్రదాయ వృత్తులపై ఆధారపడిన కుటుంబాలకు అండగా నిలుస్తున్నాం. బీసీల ఆర్థిక స్వావలంబన, వృత్తుల పరిరక్షణ, జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గోవిందరావు స్పష్టం చేశారు.

## అమెరికాలో వైసీపీ నేతకు 50 నెలల కఠిన కారాగార శిక్ష

**ఇద్దరు సహ నిందితులకు జైలు**

**యువకుడిని హింసించిన కేసులో తీర్పు**



అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకుడిని అమెరికా తీసుకెళ్లి తీవ్రంగా హింసించిన కేసులో వైకాపా నేతకు అక్కడి న్యాయస్థానం శిక్ష విధించింది. పల్నాడు. జిల్లా వినుకొండ మండలం చీకటీగలపాలెం గ్రామానికి చెందిన మార్తల పుల్లారెడ్డిని అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకురాలు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు సత్తారు పుష్పారెడ్డి కుమారుడు సత్తారు వెంకటేశ్‌రెడ్డి (38) 2022లో అమెరికా తీసుకెళ్లాడు. ఇంటర్ పూర్తిచేసిన పుల్లారెడ్డిని చదివించి ఉద్యోగం వచ్చేలా చేస్తానని నమ్మబలికాడు. పుల్లారెడ్డి అమెరికాలోని మిస్సోరి రాష్ట్రంలో ఉన్న వెంకటేశ్ రెడ్డి ఇంట్లో ఉంటూ ఇంటి పనులతో పాటు ఆయన కంపెనీలో పని చేసేవారు. ఈ క్రమంలో నిందితుడు.. నిఖిల్, శ్రవణ్ అనే వ్యక్తుల తో కలిసి పుల్లారెడ్డి పట్ల అమానుషంగా వ్యవహరించారు. ఇమిగ్రేషన్ పత్రాలు లాక్కోవడమే కాకుండా నిద్ర లేకుండా చేయ డం, తిండి సరిగ్గా పెట్టకపోవడం, బాత్రూమ్ వంటి కనీస సదుపాయాలు ఇవ్వకపోవడం వంటి చర్యలతో హింసించారు. ఆయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచేవారు. దీనిపై 2023లో కేసు నమోదైంది. ఈ ఉదంతం వెలుగులోకి వచ్చినప్పు డు 'వైఎస్ జగన్ అనుచరుడైన వెంకటేశ్‌రెడ్డి అమెరికాలో అరాచ కాలకు పాల్పడ్డారు' అని లోకేష్ ట్వీట్ కూడా చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపిన అక్కడి న్యాయస్థానం వైకాపా నేత వెంకటేశ్‌రెడ్డికి 50 నెలల కఠిన జైలుశిక్ష విధించింది.

సహ నిందితులు నిఖిల్ (30)కు 37 నెలల జైలుశిక్ష, శ్రవణ్ (26) కు 30 నెలల జైలుశిక్ష పడింది. అమెరికా సైన్యంలో మాజీ ఉద్యోగైన వెంకటేశ్ రెడ్డి తన వైకల్యాన్ని ఎక్కువగా చూపించి అక్కడి ప్రభుత్వం నుంచి 83,776 డాలర్లు (సుమారు రూ. 81 లక్షలు) అదనంగా పొందినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. దీంతో డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీకి 74,694 డాలర్లు (సుమారు రూ. 72 లక్షలు), యూఎస్ డిపార్ట్మెంట్ ఆఫ్ వెటరన్స్ ఎఫైర్స్కు 83,776 డాలర్ల నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

## విజయవాడలో.. అట్టహాసంగా జాతీయ సరస్ మేళా

- **రేపు పున్నమి ఘాట్‌లో ప్రారంభం**
- **ఈ నెల 31 వరకు నిర్వహణ**
- **నవరాత్రి శోభతో పాటు గ్రామీణ మహిళా శక్తికి వేదికగా సరస్ మేళా: మంత్రి కొండపల్లి**



అమరావతి (చైతన్యరథం): దేశవ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామీణ కళాకారులు, పారిశ్రామికవేత్తల అద్భుతమైన ఉత్పత్తులకు జాతీయస్థాయిలో గొప్ప మార్కెటింగ్ వేదికగా ' జాతీయ సరస్ ఆజీవిక మేళా-2026 ' నిలుస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలోని పున్నమి ఘాట్‌లో ఈ నెల 13 నుంచి 31 వరకు అత్యంత వైభవంగా జరిగే ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత, కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో ఏర్పాటవుతోందని మంత్రి కొనియాడారు. ఈ మేళాలో రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు దేశం నలుమూలల నుంచి వచ్చే మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా 576 స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రం నుంచి అత్యధికంగా 208 స్టాళ్లు ఉండగా, రాజస్థాన్ (24), మధ్యప్రదేశ్ (23), ఉత్తరప్రదేశ్ (22), మహారాష్ట్ర (21), పశ్చిమ బెంగాల్ (19), కేరళ (17), పంజాబ్ (17) రాష్ట్రాల స్టాల్స్ ఈ మేళాలో కొలువు దీరుతున్నాయని కొండపల్లి తెలిపారు.

ఏపీ ఎస్‌హెచ్‌జి మహిళలు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు 'స్వయం ఏపీ' బ్రాండ్ కింద తమ ఉత్పత్తులను జాతీయ స్థాయిలో ప్రదర్శించి, విక్రయించేందుకు ఇది సువర్ణావకాశం అని... సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దే లక్ష్యంతో సెర్ప్, మెప్మా సంస్థలు అంకితభావంతో పనిచేస్తున్నాయని మంత్రి చెప్పారు.

**నవరాత్రి ఉత్సవాలతో సరస్ మేళా శోభ**

ప్రసిద్ధ బెజవాడ కనకదుర్గ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్‌తో పాటు జాతీయ సరస్ ఆజీవిక మేళా ఒకే సమయంలో జరగడం భక్తులకు, ప్రజలకు గొప్ప అవకాశమని మంత్రి తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చేవారు ఈ మేళాను సందర్శించి దేశవ్యాప్త రుచులు, వస్తువులను ఆస్వాదించవచ్చని పిలుపునిచ్చారు. ఈ మేళాలో చేనేత ఉత్పత్తులు ఉప్పాడ, వెంకటగిరి, పట్టు చీరలు, కలంకారి వస్త్రాలు, ఖాదీ దుస్తులు, గృహ అలంకరణ వస్తువులతో పాటు చేతిపనుల వస్తువులైన చెక్క శిల్పాలు, టెర్రకోట పాత్రలు, జూట్ బ్యాగులు, ప్రకృతి సిద్ధమైన సబ్బులు, హెర్బల్ ఉత్పత్తులు కూడా ప్రదర్శనలో ఉంచుతారని తెలిపారు. అలాగే చిరుధాన్యాలు (మిల్లెట్స్), సంప్రదాయ స్వీట్లు, కోల్డ్ ప్రెస్డ్ నూనెలు, నాణ్యమైన ఊరగాయలు, తేనె, అటవీ సహజ ఉత్పత్తులతో పాటు వివిధ రాష్ట్రాల ప్రసిద్ధ లైవ్ ఫుడ్ స్టాళ్లు కూడా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. మేళాకు వచ్చే సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విశాలమైన పార్కింగ్, తాగునీరు, భద్రత, వైద్య శిబిరాలు వంటి అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నా మని.. విజయవాడ చుట్టుపక్కల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామీణ మహిళా శక్తిని ప్రోత్సహించాలని మంత్రి కొండపల్లి విజ్ఞప్తి చేశారు.

## మంత్రి దుర్గేష్ స్పెయిన్ పర్యటన విజయవంతం

**- ఏపీ పర్యాటకరంగానికి గ్లోబల్ గుర్తింపు లభించేలా ప్రత్యేక కృషి**




అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మూడు రోజుల స్పెయిన్ పర్యటన విజయవంతంగా ముగిసింది. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పునరుద్ధరించడానికి, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడానికి, నూతన సాంకేతికతలను ప్రవేశపెట్టడానికి మంత్రి దుర్గేష్ ఈ పర్యటనలో చేసిన కృషి విశేష ప్రశంసలు పొందింది. స్పెయిన్‌లోని సెవిల్లె నగరంలో జరిగిన ప్రతిష్టాత్మక 'టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్-2026' లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున మంత్రి కందుల దుర్గేష్ ప్రసంగం అందర్నీ ఆకట్టుకుంది. గ్లోబల్ టూరిజం ట్రెండ్స్, స్మార్ట్ డెస్టినేషన్స్, సుస్థిర పర్యాటక విధానాలపై పర్యాటక నిపుణులతో మంత్రి దుర్గేష్ సుదీర్ఘంగా చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా రూపుదిద్దుకున్న వినూత్న మోడల్ 'NiVU AI'(Neural Intelligence Vernacular Unified Model)ను మంత్రి దుర్గేష్ ప్రపంచ వేదికపై ఆవిష్కరించారు. 'Explurger' సంస్థ సహకారంతో ఏపీలోని 100కు పైగా ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలలో పర్యాటకులకు తమ సొంత భాషలోనే సమాచారం అందించేలా ఈ సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా స్పెయిన్‌కు చెందిన పలు అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పర్యాటక సంస్థలతో మంత్రి దుర్గేష్ నేరుగా సమావేశమ య్యారు. సుదీర్ఘ తీరప్రాంతంలో వెల్ నెస్ సెంటర్లు, టెంపుల్ టూరిజం, ఎకో-టూరిజం, రిసార్టుల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

పర్యటన ముగించుకుని ఆదివారం విజయవాడ చేరుకున్న మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ స్పెయిన్ పర్యటన ద్వారా లభించిన అనుభవాలు, ఆధునిక సాంకేతికత, అంతర్జాతీయ పెట్టుబడుల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన చర్యలు తీసుకోను న్నట్లు పేర్కొన్నారు. స్పెయిన్‌లో తనకు లభించిన ఆతిథ్యం పట్ల మంత్రి హర్షం వ్యక్తంచేశారు.

# డిశ్చార్జి పిటిషన్లతో ఇంకెన్నాళ్లు సాగదీస్తారు?

- **జగన్‌కు ఎమ్మెల్యే సోమిరెడ్డి సూటిప్రశ్న**
- **హైకోర్టులో ఈడీ పిటిషన్‌పై సాక్షి ఏడుపులు అర్థరహితం**
- **న్యాయవ్యవస్థకు, రాజ్యాంగానికి జగన్ అతీతుడా?**

నెల్లూరు (చైతన్యరథం): జగన్ కేసుల్లో రోజు వారీ విచారణే కాదు..రోజంతా విచారణ జరగాలని నెల్లూరు జిల్లా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. జగన్ అక్రమాస్తుల కేసుల్లో రోజువారీ విచారణ జరిపి కేసులను వేగంగా తేల్చాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పిటిషన్ వేయడం 100 శాతం కరెక్ట్...ఇది ఎప్పుడో జరగాల్సిందన్నారు. ఆదివారం మీడియాతో సోమిరెడ్డి మాట్లాడుతూ ప్రధానులు, ఉపప్రధానులపైన నమోదైన కేసుల్లోనే మూడేళ్లలో విచారణ పూర్తయిందని గుర్తుచేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుపై మూడు కేసులు నమోదైతే మూడేళ్లలోనే విచారణ పూర్తయి కోర్టు తీర్పులు వచ్చాయి. జార్ఖండ్ ముక్తి మోర్చా ఎంపీల కొనుగోలు ఆరోపణలకు సంబంధించి 1996లో పీవీ నరసింహారావుపై సీబీఐ కేసు దాఖలు చేసింది. కేసు నమోదు, విచారణ, ఛార్జిషీటు దాఖలు, హైకోర్టు విచారణతో పాటు, సుప్రీం కోర్టులో అప్పీలు, తుదితీర్పు 1998లోనే వచ్చేశాయి. విదేశీ బ్యాంకుల్లో అక్రమ లావాదేవీలు చేశారని నకిలీ పత్రాలు సృష్టించారనే ఆరోపణల కేసులోనూ పీవీపై రెండేళ్ల వ్యవధిలో తీర్పు వచ్చేసింది. ఓ కేసులో ఎల్.కే అద్వానీపై కేసు నమోదుకాగానే సంచలన నిర్ణయం తీసుకున్నారు...కోర్టులో కేసు తేలే వరకు పార్లమెంటులో అడుగుపెట్టనని ఎంపీ పదవికి రాజీనామా చేశారు. రెండేళ్ల వ్యవధిలోనే కోర్టులో విచారణ పూర్తిచేసుకుని నిర్దోషిగా బయటకు వచ్చి తిరిగి ఎన్నికల్లో పోటీచేసి లోక్ సభలో అడుగుపెట్టారు.

భారీ అవినీతి కేసుల్లో నిందితుడైన జగన్ రెడ్డి చట్టం, న్యాయవ్యవస్థ, రాజ్యాంగానికి అతీతుడా అని ప్రశ్నించారు. డిశ్చార్జి పిటిషన్ల పేరుతో ఇంకెంత కాలం విచారణ అడ్డుకుంటారు...వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకుంటారని నిలదీశారు.



తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని 43 వేల కోట్లకుపైగా అక్రమాస్తులు కూడగట్టిన జగన్ రెడ్డిపై 2011లో సీబీఐ కేసులు నమోదు చేసింది. 15 ఏళ్లు గడుస్తున్నా విచారణ ప్రారంభం కాని ఆ కేసుల్లో రోజువారి విచారణ జరిపేలా సీబీఐ కోర్టును ఆదేశించాలని హైకోర్టును ఈడీ కోరింది. రూ. 43 వేల కోట్ల అక్రమాస్తులకు సంబంధించిన భారీ అవినీతి కేసులో ముద్దాయిగా ఉండి కూడా జగన్ రెడ్డి సీఎం సీటులో కొనసాగారు. దేశంలోనే ఇది భారీ అవినీతి కేసు...కోర్టులో ఈ కేసు విచారణ ముందుకు సాగకుండా డిశ్చార్జి పిటిషన్ల పేరుతో అడ్డుకుంటున్నారు. కనీసం కోర్టు వాయిదాలకు కూడా హాజరుకారా....డిశ్చార్జి పిటిషన్లు వేసుకుంటూ ప్యాలెస్‌లకు పరిమితమవుతారా? జగన్ రెడ్డిపై నమోదైన కేసుల్లో వందల మంది సాక్షులున్నారు..వారందరినీ విచారించాలంటే ఉదయం నుంచి సాయంత్రం వరకూ విచారణ జరగాలి. అందుకే రోజంతా విచారణ జరపాలనేది మా డిమాండ్. చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానమనే సందేశం ప్రజల్లోకి వెళ్లాలి. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులతో డబ్బున్న వాళ్లు కోర్టుల్లో కేసులను ఎంతకాలమైనా సాగదీస్తారనే భావన ప్రజల్లో వస్తోంది. హైకోర్టులో ఈడీ పిటిషన్లు దాఖలు చేయడంపై సాక్షిలో వచ్చిన కథనాలు హాస్యాస్పదం. 15 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న కేసులను రోజువారీగా విచారణ జరపాలని ఈడీ కోరడం సాక్షికి ఇష్టం లేదంట. ఈడీ కోరినట్టు రోజువారీ విచారణతో పాటు రోజంతా విచారణ జరిగి త్వరగా తీర్పులు రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని సోమిరెడ్డి అన్నారు.

# ఈడీ విచారణకు రాజకీయ రంగు పులుముతారా?

- వాస్తవాలను పక్కదారి పట్టించడమే జగన్ రాజకీయ నీతి
- కేసుల విచారణ వేగవంతం చేసి వాస్తవాలను వెలికితీయాలి
- ఆర్థిక నేరాల కేసుల నుంచి తప్పించుకునేందుకు కాలయాపన డ్రామాలు
- తప్పుచేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరు
- మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజం



అమరావతి (చైతన్యరథం): వాస్తవాలను పక్కదారి పట్టించి, రాజకీయ లబ్ధి పొందడమే జగన్‌మోహన్‌రెడ్డి నైజమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రాజకీయ వైఖరి, ఆయనపై ఉన్న కేసులు, దర్యాప్తు సంస్థల విచారణ, కోర్టు వ్యవహారాలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. వాస్తవాలను పక్కదారి పట్టించి రాజకీయంగా లబ్ధి పొందడమే జగన్ విధానమని, తనపై ఉన్న కేసుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఎదుటివారిపై నిందలు వేస్తున్నారని కొల్లు రవీంద్ర దుయ్యబట్టారు. గుడ్డ కాల్చి ఎదుటివారి మీద వేయడం, తనకు సంబంధించిన కేసుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు చేయడం జగన్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని సుమారు రూ.48 వేల కోట్ల అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై దాదాపు 15 ఏళ్లుగా జగన్‌పై కేసులు నడుస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ వ్యవహారాలపై 2011లో సీబీఐ విచారణ జరిపి కేసులు నమోదు చేసిందని, అప్పట్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని గుర్తుచేశారు. ఆ కేసుల్లో మనీ లాండరింగ్ జరిగిందని, కంపెనీల వాటాల విలువలను పెంచి, షెల్ కంపెనీలను సృష్టించి, వాటి ద్వారా వచ్చిన డబ్బును తన ఖాతాల్లోకి మళ్లించుకున్నారనేది ప్రధాన ఆరోపణ అని వివరించారు.

### వివేకా హత్య కేసుపైనా రాజకీయం

తన సొంత బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులోనూ జగన్ రాజకీయ నాటకాలు ఆడారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. హత్యను చంద్రబాబు నాయుడుకు ఆపాదించేలా అప్పట్లో 'నారాసుర రక్త చరిత్ర' అంటూ సాక్షి పత్రికలో కథనాలు ప్రచురించారని, చంద్రబాబు చేతిలో గొడ్డలి ఉన్నట్లుగా చూపిస్తూ రాజకీయ ప్రచారం చేశారని విమర్శించారు. వివేకానందరెడ్డి కుమార్తె, జగన్ చెల్లెలు సునీత న్యాయపోరాటం చేసి సీబీఐ విచారణకు పట్టుబట్టడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని, ఆ పరిణామాలు తాడేపల్లి ప్యాలెస్ వైపు వేళ్లు చూపించాయన్నారు. ఇది వాస్తవం కాదా అని జగన్‌ను ప్రశ్నించారు. ఈడీ విచారణను వేగవంతం చేయాలన్న ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో జగన్ డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తూ కాలయాపన చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. కోర్టులో నాలుగు వేలకు పైగా డిశ్చార్జ్ పిటిషన్లు వేసి, విచారణకు సంబంధించిన వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు. విచారణను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటే దానికి కూడా రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి రవీంద్ర దుయ్యబట్టారు.

### అసత్యాల 'సాక్షి'

అవినీతి సొమ్ముతో ఏర్పాటైన పత్రికగా అభివర్ణిస్తూ, పేరులో సాక్షి ఉన్నప్పటికీ అది అసత్యాలకు సాక్షిగా మారిందని మంత్రి రవీంద్ర వ్యాఖ్యానించారు. పది రూపాయల విలువైన షేరుకు రూ.350కు పైగా విలువ కట్టించి, షెల్ కంపెనీల ద్వారా పెట్టుబడులు పెట్టించి, నగదు మళ్లించుకున్నారన్నారు. ఈ వ్యవహారాల నుంచి ఎవరూ తప్పించుకోలేరన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేంద్ర ఆర్థిక శాఖకు సంబంధించిన స్వతంత్ర దర్యాప్తు సంస్థ అని, రాష్ట్ర ప్రభుత్వానికి దాని విచారణతో సంబంధం లేదని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ఈడీ విచారణను వేగవంతం చేయాలని తెలంగాణ హైకోర్టులో చర్యలు సాగుతున్న నేపథ్యంలో, దానికి రాజకీయ రంగు పులిమేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జగన్ రెడ్డి క్రిమినల్ మైండ్‌ను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. సీబీఐ కేసులు కోర్టులో ఉన్నంత మాత్రాన ఈడీ విచారణ చేయకూడదని చట్టంలో ఎక్కడా లేదని మంత్రి పేర్కొన్నారు. రెండు సంస్థల విచారణలు వేర్వేరని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. విచారణ నుంచి తప్పించుకోవాలని ప్రయత్నించినా సాధ్యం కాదని జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈడీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అని, దానిపై ఎవరి ప్రభావం ఉండదన్నారు. అలాంటి సంస్థ చేపట్టే విచారణను రాజకీయ కక్షసాధింపుగా చిత్రీకరిస్తూ సాక్షి పత్రికలో కార్టూన్లు, శీర్షికలు ప్రచురించడం ద్వారా ప్రజల్లో అపోహలు కల్పించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. విచారణ నుంచి తప్పించుకోవచ్చనే ఉద్దేశంతోనే మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు.

### ఆర్థిక నేరాలపై విచారణ వేగవంతం కావాలి

ఆర్థిక నేరాలు సమాజానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు క్యాన్సర్ వంటివని సుప్రీంకోర్టు చెప్పిందని కొల్లు రవీంద్ర గుర్తుచేశారు. ఆర్థిక నేరాలు దేశ ఆర్థిక పరిస్థితులపై, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. డబ్బు ఉందనే కారణంతో అక్రమాలకు పాల్పడటం, కేసుల విచారణ జరగకుండా డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తూ కాలయాపన చేయడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. డబ్బుంటే కేసులను మాఫీ చేసుకోవచ్చా? డబ్బుంటే కేసులను సుదీర్ఘకాలం సాగదీయవచ్చా? అని ప్రశ్నించారు. కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా విచారణను ఆలస్యం చేసి రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతో జగన్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగత హాజరు విషయంలో నిర్ణయం తీసుకునే అధికారం కోర్టులకు ఉందని మంత్రి తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కావాలా వద్దా అనే అంశం చట్టపరమైన వ్యవహారమని, దాని నుంచి మినహాయింపు కోరుతూ పిటిషన్ వేస్తే దానిపై నిర్ణయం తీసుకునేది హైకోర్టేనని అన్నారు. దీనికి ప్రభుత్వానికి ఏమి సంబంధమని ప్రశ్నించారు. ప్రతి అంశానికి సంబంధాలు కల్పిస్తూ తన స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజాక్షేత్రంలో ఉన్నామని చెప్పి విచారణల నుంచి తప్పించుకోవచ్చా? ప్రజాప్రతినిధులు తప్పులు చేస్తే కోర్టులకు హాజరుకావాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా ఐదేళ్లు ఉన్న సమయంలోనూ విచారణలకు హాజరుకాకుండా వ్యవహరించారని, ఇప్పుడు కూడా డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తూ వాయిదాలను తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు.

### తండ్రిని కూడా కేసుల్లో ఇరికించారు

జగన్ రెడ్డి స్వార్థం కోసం తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని సైతం కేసుల్లో ఏ5గా చేర్చే పరిస్థితి తీసుకొచ్చారని కొల్లు రవీంద్ర విమర్శించారు. కొడుకుగా తండ్రికి గౌరవం పెంచాల్సిన జగన్ రెడ్డి.. అందుకు భిన్నంగా ఆయనపై ఉన్న నేరారోపణల్లో తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని ఇరికించారని, ఈ పరిణామాలు చరిత్రలో నిలిచిపోతాయని వ్యాఖ్యానించారు. తండ్రి మరణించినప్పుడు ఆయన భౌతికకాయం పక్కనే కూర్చుని సంతకాలు సేకరించి జగన్ రెడ్డి స్వార్థ రాజకీయాలకు పాల్పడ్డాడని ఎద్దేవా చేశారు. జగన్ రాజకీయ సంస్కృతి, నేర చరిత్రపై ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ ఘటన జరిగినా రెచ్చగొట్టే కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పదహారు నెలలపాటు జైలు జీవితం గడిపినా ఆయనలో ఎలాంటి మార్పు రాలేదని విమర్శించారు. ఇంకా నేరపూరిత ఆలోచనలతో యువతను తప్పుదోవ పట్టిస్తూ వారిని సర్వనాశనం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 'రప్పా రప్పా' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా కేసుల నుంచి ఎవరూ తప్పించుకోలేరని, విచారణను తాత్కాలికంగా ఆలస్యం చేయాలని ప్రయత్నించినా కోర్టులు ఈ అంశాలను తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

### దర్యాప్తు సంస్థలపై ఆరోపణలు సరికాదు

దర్యాప్తు సంస్థలపై ఆరోపణలు చేయడం రాజకీయ ఉన్మాదానికి నిదర్శనమని కొల్లు రవీంద్ర అన్నారు. గతంలో సుప్రీంకోర్టు కూడా ఈ కేసులకు సంబంధించి ప్రస్తావనలు చేసిందని పేర్కొన్నారు. జగన్ బెయిల్ పిటిషన్ సందర్భంగా ఈ కేసులో ఆర్థిక నేరాలకు సంబంధించిన అంశాలు ప్రస్తావనకు వచ్చాయని అన్నారు. అక్రమాస్తుల కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ సాక్షి పత్రికలో తప్పుడు కథనాలు ప్రచురిస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం దురదృష్టకరమని విమర్శించారు. ఈ వ్యవహారాన్ని కోర్టులు కూడా తీవ్రంగా పరిగణించాలన్నారు. పదిహేను సంవత్సరాలుగా కేసుల విచారణకు హాజరుకాకుండా తప్పించుకునే పరిస్థితులు కొనసాగితే న్యాయస్థానాలపై సామాన్యులకు నమ్మకం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. కేసుల విచారణను అత్యంత వేగంగా పూర్తి చేసి, వాటిలోని వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

### చట్టం నుంచి తప్పించుకోలేరు

కేసుల్లోని ఆరోపణలు నిరూపితమైతే వాస్తవాలు బయటపడతాయనే భయంతోనే తప్పుడు కథనాలు ప్రచురిస్తూ కేంద్ర ప్రభుత్వంపై, కేంద్ర దర్యాప్తు సంస్థలపై, రాష్ట్రాలపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఇలాంటి ప్రయత్నాలను ప్రజలందరూ గమనించాలని కోరారు. నేరాలకు పాల్పడినవారు ఎప్పటికీ చట్టం నుంచి తప్పించుకోలేరని అన్నారు. విచారణలో కొంత ఆలస్యం కావచ్చేమో కానీ తప్పు చేసినవారు కచ్చితంగా శిక్షించబడతారని పేర్కొన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా జగన్‌మోహన్‌రెడ్డి చట్టం నుంచి తప్పించుకోలేరని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు.

### బీసీల రాజకీయ భరోసా టీడీపీతోనే సాధ్యం

బీసీలకు రాజ్యాధికారం.. కూటమి ప్రభుత్వ ధ్యేయం. బీసీల రాజకీయ భరోసా టీడీపీతోనే సాధ్యం. బీసీల అభ్యున్నతి, రాజకీయ సాధికారత, సామాజిక న్యాయం కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. బీసీలకు విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధితో పాటు రాజకీయంగా సముచిత స్థానం కల్పించేందుకు ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 24 శాతం నుంచి 35 శాతానికి పెంచి అమలు చేయనుంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలు పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తుంది. బీసీల అభ్యున్నతికి ఎంత చేసినా తక్కువేనని, వారి సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి రంగాల అభివృద్ధితో పాటు రాజకీయ సాధికారతకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.

### బీసీల రాజకీయ ఎదుగుదలకు టీడీపీ పునాది

1987లో ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించి, గ్రామస్థాయి నుంచి బీసీ నాయకత్వం ఎదిగేందుకు పునాది వేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తదనంతర ప్రభుత్వాలు సైతం అదే విధానాన్ని కొనసాగించాయని పేర్కొన్నారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి నష్టం జరిగింది. 16,800 మందిని రాజ్యాంగబద్ధమైన పదవులకు దూరం చేసిందని మంత్రి రవీంద్ర విమర్శించారు.

### బీసీ రిజర్వేషన్ల కోసం కూటమి న్యాయపోరాటం

2024 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే న్యాయపరమైన సవాళ్లు ఎదురవడంతో హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించి బీసీలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. న్యాయస్థానాల తీర్పుల నేపథ్యంలోనూ ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా, చట్టపరమైన పరిధిలో బీసీలకు సాధ్యమైనంత ఎక్కువ ప్రయోజనం కల్పించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించిం. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులను అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే నిర్ణయాన్ని మంత్రివర్గం ఆమోదించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను గౌరవిస్తూనే బీసీలకు మరింత ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.

### స్థానిక సంస్థల్లో బీసీలకు ప్రాధాన్యం

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం గ్రామీణ స్థానిక సంస్థల్లో గ్రామ వార్డు సభ్యులకు 26.73 శాతం, సర్పంచులకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం, జెడ్పీ చైర్‌పర్సన్లకు 23.08 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల్లో వార్డు సభ్యులకు 32.78 శాతం, మున్సిపల్ చైర్మన్లకు 33.02 శాతం, మేయర్లకు 35.29 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా నిర్ణయం తీసుకుంది. కొన్ని కేటగిరీల్లో చట్టపరమైన పరిమితుల కారణంగా 34 శాతం కంటే తక్కువ రిజర్వేషన్లు అమలవుతున్నప్పటికీ, కూటమి పార్టీల పరంగా ఆ లోటును భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతానికి మించి సీట్లు కేటాయించాలన్న లక్ష్యంతో, అవసరమైతే 34 శాతానికి మించి వరకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా బీసీలకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### బీసీల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు

రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు బీసీ వృత్తుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. వడ్డెర్లకు మైనింగ్ లీజుల్లో 33 శాతం కేటాయింపు, గీత కార్మికులకు ఎక్సైజ్ దుకాణాల్లో 10 శాతం కేటాయింపు, నేతన్నలకు చేయూత, ఉచిత విద్యుత్ పథకాలు, మత్స్యకారుల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. సెలూన్లకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు నెలవారీ భృతిని రూ.25 వేలకు పెంచడం వంటి చర్యలు సంప్రదాయ వృత్తులపై ఆధారపడిన కుటుంబాలకు అండగా నిలుస్తున్నాం. బీసీల ఆర్థిక స్వావలంబన, వృత్తుల పరిరక్షణ, జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి రవీంద్ర స్పష్టం చేశారు.

జోన్ - 1 (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)

చైతన్యరథం

# ఘనంగా కొత్తమ్మతల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు

## మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు ఆలయ ఈవో ఆహ్వానం



కోటబొమ్మాళి (చైతన్యరథం): శ్రీశ్రీశ్రీ కొత్తమ్మతల్లి అమ్మవారి ఉత్సవాలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఆలయ ఈవో వి రాధాకృష్ణ ఆహ్వానించారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వరుసగా రాష్ట్రస్థాయి ఉత్సవాలను నిర్వహిస్తుండటం విశేషం. ఈ నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరాడ గోవిందరావు, ఇతర ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే భవిష్యత్తుకు భరోసా



## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు (చైతన్యరథం): ప్రపంచంలో ప్రతి ఒక్కరి జీవితాన్ని, తలరాతను మార్చే శక్తి ఒక్క చదువుకు మాత్రమే ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు బ్రాడీపేట అల్లు వెంకట సత్యనారాయణ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంతంలో ఆ పాఠశాల 6,7,8,9 తరగతుల విద్యార్థినీ విద్యార్థులు 198 మందికి పూలపల్లి సంధ్య మెరైన్స్ వారి సిఎస్ఆర్ నిధులతో ఉచిత సైకిళ్లను సంస్థ డైరెక్టర్ కే. అరుణ్ కుమార్ తో కలిసి మంత్రి నిమ్మల రామానాయుడు అందజేశారు. మంత్రి రామానాయుడు, అరుణ్ కుమార్ లకు పాఠశాల తరఫున ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. సైకిళ్లను స్వయంగా అందజేసిన మంత్రి విద్యార్థిని విద్యార్థులతో మమేకమవుతు సైకిల్ తొక్కి అందర్నీ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ చదువుకుంటే రిక్షా కార్మికుడు కుమారుడు కలెక్టర్, సాధారణ పని చేసుకునే వారి కుమారుడు కుమార్తెలు సాఫ్ట్వేర్ రంగంలో రాణించవచ్చన్నారు. చిన్నపాటి గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన తాను కూడా పీహెచ్డీ ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారానే నాడు అధ్యాపకునిగా, నేడు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈ స్థాయికి ఎదిగానని మంత్రి రామానాయుడు తెలిపారు. చదువు పట్ల తమ పిల్లలకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. సేవా కార్యక్రమాల గురించి వివరిస్తూ అందులో పొందే ఆనందం, తృప్తి మరి ఎక్కడ ఉండదని ఆ ఉద్దేశంతోనే తన తండ్రి పేరుతో ధర్మారావు ఫౌండేషన్ ఏర్పాటుచేసి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులందరికీ ఉచితంగా సైకిలను అందజేయాలని అనుకున్నా తనకు సంస్థలు, ఇతర కంపెనీలు అందిస్తున్న సహకారంతో 6 నుంచి పదో తరగతి వరకు అందరికీ దశలవారీగా అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను అన్నారు. అందులో భాగంగానే విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత సైకిళ్లతో పాటు గోరింటలో స్మశాన వాటిక అభివృద్ధి పనులకు మన ప్రాంతంలోని పూలపల్లి సంధ్య మెరైన్స్ రూ 25 లక్షలు అందజేశారని సంస్థ ఎండి కే ప్రసాద్, డైరెక్టర్లు అరుణ్ కుమార్, ఆనంద్ కుమార్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# చిలకలూరిపేటలో రూ.310కోట్లతో అభివృద్ధి పనులు : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం.. ప్రత్యేక చొరవ వల్లే నిధుల కొరత లేకుండా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు జోరందుకున్నాయని, కేంద్ర..రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చిలకలూరిపేట పట్టణంలో ఎటుచూసినా అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు వివరించారు. ఆదివారం ఆయన మున్సిపాలిటీ పరిధిలో నామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానంలో రూ.52 కోట్లతో చేపట్టే మౌలిక వసతుల కల్పన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో నేడు రూ.52 కోట్లతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టినట్టు ప్రత్తిపాటి చెప్పారు. సమర్థులైన నాయకుడు, సరైన ప్రభుత్వం ఉంటే ప్రజలకు ఎలాంటి లోటు ఉండదని చెప్పేందుకు కూటమి ప్రభుత్వ పనితీరే నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు... తన అనుభవం, ఆలోచనలతో రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. అదేవిధంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పల్లెపండుగ కార్యక్రమంతో గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని ఎమ్మెల్యే తెలిపారు. కొండవీడు, చౌడవరం రహదారి, టన్నెల్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని, కేంద్ర సహకారంతో స్వార్క్ పథకం నిధులతో కొండవీడు అభివృద్ధి పనులు చేపట్టబోతున్నట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు.




# గుంటూరు పశ్చిమలో వైసీపీ కనుమరుగవ్వాలి

## బీసీలకు 34 శాతానికి పైగా రిజర్వేషన్లు ఖాయం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రజలు ఇచ్చే తీర్పుతో వైసీపీ కనుమరుగు అవ్వాలని, బీసీలకు 34 శాతానికి పైగా రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో వైఎస్సార్‌సీపీ అనుసరించిన వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం గుంటూరు ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డులోని వాటర్ ట్యాంకుల వద్ద ఓ ఫంక్షన్ హాలులో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశం పై ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ చేస్తున్న కృషిని వివరించడంతోపాటు, ఈ విషయంలో వైఎస్సార్‌సీపీ వైఖరిని ఎండగడుతూ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. బీసీలకు రాజకీయంగా ప్రాతినిధ్యం, నాయకత్వ అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని తొలుత గుర్తించిన పార్టీ తెలుగుదేశమని పేర్కొన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు రాజకీయాల్లో ఎదిగి నాయకులుగా మారినప్పుడే వారి జీవితాల్లో మార్పు వస్తుందనే ఉద్దేశంతో ఎన్టీఆర్ రిజర్వేషన్లకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. తొలుత 20 శాతంగా ఉన్న రిజర్వేషన్లను క్రమంగా పెంచుకుంటూ వచ్చారని, ప్రస్తుతం 34 శాతం రిజర్వేషన్ల దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా, నాయకత్వ బాధ్యతలు చేపట్టే స్థాయికి తీసుకెళ్లాలనే ఆలోచనతో తెలుగుదేశం పార్టీ పనిచేస్తోందని, ఎన్టీఆర్ కులాల మధ్య విభజన రాజకీయాలకు భిన్నంగా సామాజిక సమానత్వానికి ప్రాధాన్యమిచ్చారని, చంద్రబాబు నాయుడు సైతం బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషించారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. యువతకు, వెనుకబడిన వర్గాలకు నాయకత్వ బాధ్యతలు అప్పగించడం ద్వారా అనేక మంది నాయకులను తయారు చేసిన రాజకీయ వేదికగా టీడీపీ నిలిచిందన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంలో తెలుగుదేశం పార్టీ స్పష్టమైన వైఖరితో ముందుకు వెళ్తోందని మాధవి తెలిపారు. సుప్రీంకోర్టులో 50 శాతం రిజర్వేషన్ల పరిమితికి సంబంధించిన న్యాయపరమైన అంశాలు ఉన్నప్పటికీ, బీసీలకు మరిన్ని అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన పరిస్థితులను ప్రస్తావిస్తూ, ఆయా రాష్ట్రాల్లో అనుసరించిన విధానాలు, వాటి వెనుక ఉన్న న్యాయపరమైన కారణాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జనగణన, సామాజిక వెనుకబాటుతనానికి సంబంధించిన గణాంకాలు, న్యాయపరమైన అంశాలు రిజర్వేషన్ల నిర్ణయాల్లో కీలకమని పేర్కొన్నారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై వైఎస్సార్‌సీపీ అనుసరించిన వైఖరిని ప్రశ్నించిన ఎమ్మెల్యే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతానికి పైగా సీట్లు కేటాయించేందుకు ఆ పార్టీ సిద్ధంగా ఉందా అని నిలదీశారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంపై మాటలకు, ఆచరణకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. రాజకీయాల్లో ప్రతి ఒక్కరికీ ఒకేసారి పదవులు రావడం సాధ్యం కాదని, అవకాశాలు వచ్చిన వారిని గెలిపించడం కూడా నాయకత్వంలో భాగమేనని మాధవి అన్నారు. ఎన్నికల్లో గెలిచిన వారే నాయకులు కాదని, ఇతరులను ముందుకు తీసుకెళ్లి విజయానికి తోడ్పడేవారు కూడా నాయకులేనని చెప్పారు. పార్టీ కోసం, నాయకత్వం కోసం, ప్రజాసేవ కోసం నిలబడిన వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయనే నమ్మకం తనకు ఉందన్నారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. స్థానికంగా బలమైన నాయకత్వం ఉండటం, విభేదాలు వచ్చినా చర్చల ద్వారా పరిష్కరించుకునే సామర్థ్యం ఉండటం నియోజకవర్గ ప్రత్యేకతగా అభివర్ణించారు. ఈ ఐక్యతను కాపాడుకుంటూ రానున్న ఎన్నికల్లో సమష్టి కృషితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. కూటమి పార్టీల సమన్వయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించే విషయంలో కూటమి నాయకత్వంపై విశ్వాసం ఉంచాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల కేటాయింపుపై నాయకత్వం తగిన కసరత్తు చేస్తుందని, బీసీ వర్గాల అభ్యున్నతికి అందరూ సహకరించాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలు ఐక్యంగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి రాజకీయంగా స్థానం లేకుండా చేసే దిశగా కూటమి శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్ళ వెంకటేష్ యాదవ్, నిమ్మల శేషయ్య, తుమ్మల నాగేశ్వరరావు, గాలం వెంకటేశ్వర్లు, అడకా శ్రీనివాస్, బత్తుల జాన్ సైద, చంద్రగిరి బాబు, పేరయ్య, సంజీవ్, ఉప్పతల సాంబ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత

## రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రూ.2.20 కోట్ల అంచనా వ్యయంతో రోడ్ల పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక 29వ డివిజన్‌లోని సోమాలమ్మ అమ్మవారి ఆలయం జంక్షన్ నుంచి అన్నపూర్ణమ్మపేట రైల్వే గేటు వరకు రూ.78 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నపూర్ణమ్మపేట రైల్వే గేటుకు ఇరువైపులా రోడ్ల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. 29, 30వ డివిజన్ల పరిధిలో రూ.78 లక్షలతో రోడ్డు పునరుద్ధరణ పనులు, 28, 29, 30వ డివిజన్లను అనుసంధానించే ప్రధాన రహదారికి రూ.1.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ రెండు పనులకు కలిపి మొత్తం రూ.2.20 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించినట్లు వెల్లడించారు. అన్నపూర్ణమ్మపేట రైల్వే గేటు పరిసర ప్రాంతాల్లో గత 25 ఏళ్ళుగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ, రోడ్ల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టి, పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నగరంలో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. గత రెండు రోజులుగా నగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయని, రానున్న రోజుల్లోనూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సౌభాగ్య లక్ష్మి అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే చింతమనేని



పెదపాడు (సత్రంపాడు): దేవి శరన్నవరాత్రుల పవిత్ర పర్వదినాలను పురస్కరించుకుని పెదపాడు మండలం, వట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సత్రంపాడు శ్రీ సౌభాగ్య లక్ష్మి అమ్మవారి ఆలయంలో అత్యంత వైభవంగా జరుగుతున్న 40వ వార్షిక దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణానికి విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కి ఆలయ కమిటీ ధర్మకర్తలు, అర్చక స్వాములు, కూటమి నాయకులు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో కొలువుదీరిన శ్రీ సౌభాగ్య లక్ష్మి అమ్మవారికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు శాస్త్రోక్తంగా అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించి, శేషవస్త్రం, అమ్మవారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రులు శక్తి ఆరాధనకు ఎంతో ప్రశస్తమైనవని, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరిపై శ్రీ సౌభాగ్య లక్ష్మి అమ్మవారి చల్లని దీవెనలు ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు, వ్యాపారాలు వృద్ధి చెంది ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. 40 సంవత్సరాలుగా ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులను, భక్తులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, ధర్మకర్తలు, స్థానిక కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళా భక్తులు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం

## కుడుపూడి సత్తిబాబు పిలుపు

జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా శెట్టిబలిజలందరూ ఐక్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పిలుపునిచ్చారు. చింతలపూడి నియోజకవర్గం, జంగారెడ్డిగూడెం మండలం, అయ్యవారిపోలవరంలో నిర్వహించిన శెట్టిబలిజల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. శెట్టిబలిజలు ఎక్కడ ఉన్నా సమాజ అభ్యున్నతి, రాజకీయ ప్రాతినిధ్యం, అభివృద్ధి లక్ష్యంగా ఒకే ఎజెండాతో ముందుకు సాగాలన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. శెట్టిబలిజలంతా పరస్పర సమన్వయంతో పనిచేస్తూ కూటమి విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# స్థానిక ఎన్నికల్లో జనసేనకు సంపూర్ణ మద్దతు

## శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



రంపచోడవరం (చైతన్యరథం): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ధర్మానికి కట్టుబడి జనసేనకు సంపూర్ణ మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరం మండలం కాకవాడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన అడవితల్లి బాట 2.0 కార్యక్రమంలో పాల్గొన్న ఆమె కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు పై క్షుణ్ణంగా వివరించారు. జనసైనికులకు ఎప్పుడు ప్రత్యేక స్థానం ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల పోటీల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కూటమి శ్రేణులు పూర్తి స్థాయిలో చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఎన్నిక ఏదైనా కూటమిదే విజయం అన్నట్లుగా కూటమి శ్రేణులు కంకణం కట్టుకొని సాగాలన్నారు.



# బీసీలకు ఎవరేం చేశారో తేల్చుకుందాం రండి!

## బీసీలకు వెన్నుపోటు పొడిచింది గొడ్డలి పార్టీయే : టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం సవాలు

రాజమహేంద్రవరం (చైతన్యరథం): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల విషయంలో వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలను టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం తీవ్రంగా ఖండించారు. రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడుతూ, బీసీలకు రాజకీయ గుర్తింపు, రిజర్వేషన్లు కల్పించిన చరిత్ర తెలుగుదేశం పార్టీకే ఉందని పేర్కొన్నారు. బీసీలకు అన్యాయం చేసిన వారే ఇప్పుడు నీతులు చెబుతూ, ప్రాంతాలవారీగా సమావేశాలు పెట్టి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. 1987లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నాయకత్వంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారని, 1995లో వాటిని 34 శాతానికి పెంచిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని రెడ్డి సుబ్రహ్మణ్యం వివరించారు. అయితే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని ఆయన ఆరోపించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కొనసాగించేందుకు న్యాయపోరాటం చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బీసీలకు తాము ఏం చేశామో చెప్పుకోలేని వైసీపీ నాయకులు రాజమహేంద్రవరంలో సమావేశాలు నిర్వహిస్తూ విమర్శలు చేయడం ఏమిటని రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. ఐదు రీజియన్లలోనూ సమావేశాలు పెట్టడానికి సిద్ధమై విమర్శలు చేస్తూ తిరగడం కాదని, బీసీలకు గతంలో ఏం చేశారో ప్రజలకు వివరించాలని సవాల్ విసిరారు. "బీసీలకు మీరు ఏం చేశారు? మేము ఏం చేశాము? చర్చకు రండి.. మేము సిద్ధంగా ఉన్నాం" అంటూ సవాల్ చేశారు. వైసీపీ నాయకుల విమర్శలను ఉద్దేశిస్తూ, "బీసీలకు ఏం చేయకుండా ఇప్పుడు గ్రామసింహాల్లా మొరుగుతున్నారు" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజలకు వాస్తవాలు తెలుసునని, రాజకీయ విమర్శలతో బీసీలను తప్పుదోవ పట్టించలేరని అన్నారు. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితి కీలకమని పేర్కొన్న రెడ్డి సుబ్రహ్మణ్యం, బీసీలకు సాధ్యమైనంత న్యాయం చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. బీసీలకు మెరుగైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రభుత్వం న్యాయపరమైన మార్గాలను పరిశీలిస్తోందని తెలిపారు. బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీసీ రక్షణ చట్టం తీసుకురావడంతో పాటు ఆదరణ పథకాన్ని అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గీత కార్మికులకు మద్యం దుకాణాలు, బార్లలో 10 శాతం రిజర్వేషన్, లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలన్న ప్రభుత్వ హామీలను కూడా ప్రస్తావించారు. చెట్టుపై నుంచి పడి మరణించే గీత కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించే అంశాన్ని వివరించారు.

# సీఎం సహాయని పేదల పాలిటి పెన్నిధి

వినుకొండ (చైతన్యరథం): సీఎం సహాయని పేదల పాలిటి పెన్నిదని ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 160 మంది లబ్దిదారులకు,74 లక్షల 31వేల రూపాయల చెక్కులను ఆదివారం తన కార్యాలయంలో చీఫ్ విప్ జీవీ పంపిణీ చేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు నాయుడు అందించిన నిధులు, తమకు అందేలా కృషిచేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీకి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు జనసేన నాయకులు నిశ్శంకర శ్రీనివాసరావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధితో పేద కుటుంబాలకు భరోసా

## ఇప్పటివరకు రూ.26 కోట్ల సీఎంఆర్ఎఫ్ సాయం : ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వెల్లడి



పెనమలూరు (చైతన్యరథం): ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు, పోరంకిలోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 60 మంది లబ్ధిదారులకు రూ.32 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ,అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు, ఇప్పటివరకు పెనమలూరు నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.26 కోట్ల సీఎంఆర్ఎఫ్ సాయం అందించినట్లు తెలిపారు,చెక్కులు అందుకున్న ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత రెండున్నర సంవత్సరాల్లో తాడిగడప, ఉయ్యూరు మున్సిపాలిటీల పరిధిలో సుమారు రూ.300 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా నూతన రహదారులు,డ్రైనేజీల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు చెప్పారు,తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని,కృష్ణానది నుంచి నేరుగా పైపులైన్ ద్వారా నీటిని తీసుకువచ్చే పనులను కూడా త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో 80 శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందకుండా నిలిచిపోయాయని బోడే ప్రసాద్ విమర్శించారు, లబ్ధిదారులకు తెలియకుండా గృహాలపై రుణాలు తీసుకున్నారంటూ గత ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు చేపట్టామని, రాబోయే సంక్రాంతి నాటికి సామూహిక గృహప్రవేశాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడంలో ఆశించిన పురోగతి సాధించలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు,కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర పురోగతికి కృషి చేస్తోందని తెలిపారు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన,పెట్టుబడుల ఆకర్షణ, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వరించారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించిన ఆయన,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. పెనమలూరు నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా నేరుగా తనకు ఫోన్ చేసి తెలియజేయవచ్చని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ గారు తెలిపారు,సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.





# ఇంద్రకీలాద్రిపై కట్టుదిట్టంగా దసరా ఏర్పాట్లు

**పరిశీలించిన బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్**

**భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా**

**తొలిరోజు బాలా త్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారి దర్శనం**

విజయవాడ (చైతన్యరథం): ఇంద్రకీలాద్రిపై శ్రీ పరాభవ నామ సంవత్సర దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ తొలిరోజు బాలా త్రిపుర సుందరి అలంకారంలో సాక్షాత్కరించిన కనకదుర్గమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. రైతులు, యువత, మహిళలు, పేదలు సహా సమాజంలోని అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అమ్మవారిని వేడుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఆలయ పరిసరాల్లో భక్తుల కోసం కల్పించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో నేరుగా మాట్లాడి, వారు ఏయే ప్రాంతాల నుంచి వచ్చారు, దర్శన ఏర్పాట్లు ఎలా ఉన్నాయి, అవసరమైన సౌకర్యాలు అందుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది భక్తులు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకురావడంతో, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి భక్తులకు తక్షణమే తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. దసరా మహోత్సవాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, తాగునీరు సహా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణతో పాటు ఆలయాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ఎంతో ముఖ్యమని, భక్తుల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందించడం ద్వారా వారికి మెరుగైన దర్శన అనుభూతిని అందించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# అందుబాటులోకి అంతర్జాతీయ వైద్యసౌకర్యాలు

## గుంటూరులో రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యే మాధవి



గుంటూరు (చైతన్యరథం): గుంటూరులోని లక్ష్మీపురం ప్రాంతంలో కొత్తగా ఏర్పాటుచేసిన రెయిన్ బో చిల్డ్రన్ హాస్పిటల్‌ను స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభించారు. పెమ్మసాని మాట్లాడుతూ హైదరాబాద్ స్థాయిలో అందుబాటులో ఉండే అంతర్జాతీయ స్థాయి వైద్య సౌకర్యాలు మన ఇపుడు గుంటూరుకు కూడా అందుబాటులోకి రావడం మంచి పరిణామమన్నారు, దాదాపు రెయిన్బో హాస్పిటల్స్ దేశవ్యాప్తంగా ఎంత సక్సెస్ అయ్యాయో అందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పటికీ 26 బ్రాంచ్ లను రెయిన్ బో హాస్పిటల్స్ యాజమాన్యం ప్రారంభించుకుందన్నారు. 25 వారాల లోపు జన్మించిన పిల్లలలో చాలా తక్కువ బర్త్ సక్సెస్ రేట్ ఉంటుంది. కానీ రైన్బో హాస్పిటల్ ద్వారా సక్సెస్ రేట్ ఎక్కువగా పెంచడం ఇక్కడికి వైద్యుల సమర్థతకు నిదర్శనం. ఇంత సేవ చేస్తున్నటువంటి రమేష్ వైద్య సేవ దక్షతను గుర్తించి, ఈ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి రావడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ మాతా, శిశు విభాగం అనేది చాలా సెన్సిటివ్ విభాగమన్నారు. ఇలాంటి విభాగానికి ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలంటే కచ్చితంగా నమ్మకమైనటువంటి ఆసుపత్రికి మాత్రమే వెళ్లాలని ప్రజలు కోరుకుంటారన్నారు. అలాంటిది పిల్లల ఆరోగ్యం అంటేనే రెయిన్బో హాస్పిటల్ అనే స్థాయిలో ఎదిగిన ఈ హాస్పిటల్ పై ప్రజలు నమ్మకం ఉంచుతున్నారన్నారు. క్రమంలో గుంటూరులో రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రారంభించడం పట్ల హాస్పిటల్ యాజమాన్యానికి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ డాక్టర్‌గా బిజినెస్ మేన్‌గా, రాజకీయ వేత్తగా ఎదిగిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తమ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి విచ్చేసినందుకు ముందుగా ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. గుంటూరులో ప్రారంభించిన ఈ బ్రాంచ్ ఆంధ్ర ప్రదేశ్‌లో 26వ బ్రాంచ్‌గా ప్రారంభిస్తున్నామన్నారు. నెఫ్రాలజీ, హార్ట్, న్యూరాలజీ వంటి ఎన్నో ఆపరేషన్స్ హబ్ హాస్పిటల్‌లో చేసే అవకాశం మాత్రమే ఉంటుందన్నారు. ప్రస్తుతం హైదరాబాదులో ఏవైతే అంతర్జాతీయ స్థాయిలో ఆపరేషన్లు చేయిస్తున్నామో, వాటిని త్వరలో ఇక్కడ కూడా చేస్తామని చెప్పగలుగుతున్నామన్నారు. అది తక్కువ బరువుతో జన్మించిన పిల్లలను 1-2 కాదు ఇప్పటివరకు తమ హాస్పిటల్ 3 వేలకు పైగా పిల్లలను బతికించిందని గర్వంగా చెప్పగలుగుతున్నామని ప్రకటించారు.

# నేడు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

## నందమూరి రామకృష్ణ తదితరుల హాజరు

పెనమలూరు (చైతన్యరథం): ఆంధ్రుల ముద్దుబిడ్డ, నట సార్వభౌమ నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ, ఎన్టీఆర్ రోడ్ ఆర్చ్ ప్రారంభోత్సవం సోమవారం జరగనున్నాయి. ఎన్టీఆర్ రోడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ నందమూరి రామకృష్ణ , బోడె ప్రసాద్, కొల్లు రవీంద్ర, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, కాగిత కృష్ణ ప్రసాద్, అనుమోలు ప్రభాకర్, వీరంకి గురుమూర్తి హాజరవుతారు. ఎన్టీఆర్ రోడ్ ఆర్చ్ ప్రారంభోత్సవం జరగనున్నాయి.ఎన్టీఆర్ రోడ్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్లమూడి సందీప్ ఆధ్వర్యంలో, అసోసియేషన్ సభ్యుల సమిష్టి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అధ్యక్షుడు సందీప్ కార్యక్రమ ఏర్పాట్లను సమన్వయం చేస్తుండగా, అసోసియేషన్ సభ్యులు నిర్వహణలో భాగస్వాములవుతున్నారు.

# ఒంగోలులో విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత సైకిళ్ళు

**అమరావతి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 1,100 సైకిళ్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు**




ఒంగోలు (చైతన్యరథం): ఒంగోలులోని మినీ స్టేడియంలో అమరావతి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమ పిల్లలు సైకిళ్ళు కావాలని కోరినప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వారి కోరికను తీర్చలేకపోయామని కొందరు తల్లిదండ్రులు పేర్కొన్నారు. అయితే శాసనసభ్యుడు జనార్దన్ తమ పిల్లల కోరికను తీర్చి, వారి సైకిల్ కలను సాకారం చేశారని ఆనందం వ్యక్తం చేశారు. విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే జనార్దన్ ఎంతో కృషి చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యార్థుల సంక్షేమం, ఉన్నతికి అనేక మార్పులు, చేర్పులు చేపడుతూ విశేష కృషి చేస్తోందని పలువురు తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని అమరావతి సేవా ట్రస్ట్ ఘనంగా నిర్వహించి విజయవంతం చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు దామచర్ల జనార్దనరావు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులందరికీ సైకిళ్లు పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అమరావతి సేవా ట్రస్ట్ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు మినీ స్టేడియం నుంచి కలెక్టరేట్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని దామచర్ల జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సైకిళ్ల పంపిణీకి ఆర్థిక సహకారం అందించిన దాతలు, ధనిక్ భారత్ విద్యా సంస్థల తరఫున విక్రం వెంకట్రావు పీడీసీసీ బ్యాంకు తరఫున డాక్టర్ సీతారామయ్య, దేవి సీఫుడ్స్ తరఫున వేణు, గిరి మునంగి రాజశేఖర్ పాల్గొన్నారు. అమరావతి సేవా ట్రస్ట్ సభ్యుడు దుగ్గినేని వెంకట్రావు, పాల్వూరి బాపయ్య, అబ్బూరి నవీన్, కాట్రగడ్డ రఘుపతి, కంచర్ల వెంకటనారాయణ, మండవ వేణు తదితరులు పాల్గొన్నారు.




# టీడీపీలో మహిళల అభ్యున్నతికి ప్రాధాన్యం

**స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం పథకాలతో మహిళలకు ప్రయోజనాలు**
**సర్వేపల్లి టీడీపీ యువ నాయకులు సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, శృతి**

నెల్లూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి ప్రాధాన్యమిస్తూ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, శృతి తెలిపారు. నెల్లూరు వేదాయపాలెంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన తెలుగుమహిళ సమావేశంలో వారు మాట్లాడుతూ, స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఈఐఎల్ సీఎస్ఆర్ నిధులతో 1,850 మంది విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశామని తెలిపారు. కృష్ణపట్నంలో అదానీ ఫౌండేషన్, కసుమూరులో ఏపీ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. పొదుపు సంఘాల మహిళలకు వడ్డీ లేని బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా ఆర్థికాభివృద్ధికి సహకారం అందిస్తున్నట్లు వివరించారు.

# జగన్ కన్నా కూటమి పాలనే మేలు

**ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో వైసీపీ నుండి టీడీపీలో చేరిన నేతలు వెల్లడి**



కందుకూరు (చైతన్యరథం): లింగపాలెం గ్రామానికి చెందిన వంకదారి పరమేశ్వరరావు, అనమసాని మాచర్ల, చెన్నకృష్ణ, చొప్పర గోవిందు, మధు, శ్రీను, రమణయ్య, కేతినేని నవీన్, కామినేని మాల్యాద్రి, కందె రత్తమ్మ, ఉప్పలపాటి మాల్యాద్రి, నరసింహ, షేక్ జిలాని, మస్తాన్, యడవల్లి హజరత్, యోహాన్, పోతి పోగు రమణయ్య కుటుంబాల టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు వారందరినీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామ టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ చంద్ర తిరుపతయ్య, చింతగుంపల వీరభద్రయ్య, మాలకొండయ్య, సుబ్బారావు, చొప్పర తిరుపాలు, రొడ్డా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గడిచిన రెండేళ్లలో జరుగుతున్న అభివృద్ధిని చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందని, అన్ని గ్రామాలలో మౌలిక వసతుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని పార్టీలో చేరిన వారు తెలిపారు. కూటమి పాలన... జగన్ పాలన కంటే ఎన్నో రెట్లు బాగుందన్నారు. చంద్రబాబు, కూటమి ప్రభుత్వ పరిపాలనపై ప్రజల్లో మంచి సానుకూలత ఉందన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ.... వైసీపీ ప్రభుత్వంలో బటన్ నొక్కుడు తప్ప మరొకటి లేదు. కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తున్నాం. అర్హులందరికీ పథకాలు అందిస్తున్నాం అని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ఇంటింటికి తిరిగి వివరించాలి. మన అభ్యర్థులందరినీ మంచి మెజారిటీతో గెలిపించాలి... అని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, క్లస్టర్ ఇంచార్జ్ వంకాయలపాటి మాల్యాద్రి, ఉన్నం వీరాస్వామి, చింతగుంపల మనోహర్, రామకృష్ణ, చంద్ర రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# దిగ్విజయంగా డబుల్ ఇంజన్ సర్కార్

విశాఖపట్టణం (చైతన్యరథం): కూటమి పార్టీ ల ఆధ్వర్యంలో ఆదివారం బీచ్ రోడ్ లో సేవా సంకల్ప్ అభియాన్‌లో బాగంగా ర్యాలీ, మానవహారం జరిగింది. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రజాసేవ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు కాళీమాత గుడి దగ్గర బీచ్ లో సైకత శిల్పాన్ని రూపొందించి మానవహారం నిర్వహించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖాకృతులను సైకత శిల్పంలో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరాం విశాఖ తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామ కృష్ణబాబు విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు బిజెపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు పరశురామరాజు యన్‌టిఆర్ వైద్య సేవా చైర్మన్,విశాఖ దక్షిణ ఇంచార్జి సీతంరాజు సుధాకర్, విశాఖ టీడీపీ ప్రధాన కార్యదర్శి నొదగల కృష్ణ, భీమిలి ఇంచార్జి కోరాడ రాజబాబు మాజీ కార్పొరేటర్లు జిల్లా నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.






# అవకాశాలొచ్చిన వారిని గెలిపించుకోవాలి

**డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పిలుపు**

దర్శి (చైతన్యరథం): స్థానిక ఎన్నికల్లో దర్శి నియోజకవర్గంలో ప్రజలు ఇచ్చే తీర్పుతో వైసీపీ కనుమరుగు అవ్వాలని, బీసీలకు 34 శాతానికి పైగా రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతోందని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో వైఎస్సార్సీపీ అనుసరించిన వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం దర్శి టీడీపీ కార్యాలయం లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంపై డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ చేస్తున్న కృషిని వివరించడంతోపాటు, ఈ విషయంలో వైఎస్సార్సీపీ వైఖరిని ఎండగడుతూ సమావేశంలో చర్చించారు. లక్ష్మీతో పాటు నియోజకవర్గ పరిశీలకులు గంజాం రాఘవేంద్ర నియోజకవర్గంలోని బీసీ సోదరులు ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ.. బీసీలకు రాజకీయంగా ప్రాతినిధ్యం, నాయకత్వ అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని తొలుత గుర్తించిన పార్టీ తెలుగుదేశమని పేర్కొన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు రాజకీయాల్లో ఎదిగి నాయకులుగా మారినప్పుడే వారి జీవితాల్లో మార్పు వస్తుందనే ఉద్దేశంతో ఎన్టీఆర్ రిజర్వేషన్లకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. తొలుత 20 శాతంగా ఉన్న రిజర్వేషన్లను క్రమంగా పెంచుకుంటూ వచ్చారని, ప్రస్తుతం 34 శాతం రిజర్వేషన్ల దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా, నాయకత్వ బాధ్యతలు చేపట్టే స్థాయికి తీసుకెళ్లాలనే ఆలోచనతో తెలుగుదేశం పార్టీ పనిచేస్తోందని, ఎన్టీఆర్ కులాల మధ్య విభజన రాజకీయాలకు భిన్నంగా సామాజిక సమానత్వానికి ప్రాధాన్యమిచ్చారని, చంద్రబాబు నాయుడు సైతం బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. యువతకు, వెనుకబడిన వర్గాలకు నాయకత్వ బాధ్యతలు అప్పగించడం ద్వారా అనేక మంది నాయకులను తయారు చేసిన రాజకీయ వేదికగా టీడీపీ నిలిచిందన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంలో తెలుగుదేశం పార్టీ స్పష్టమైన వైఖరితో ముందుకు వెళ్తోందనిగొట్టిపాటి లక్ష్మీ తెలిపారు. సుప్రీంకోర్టులో 50 శాతం రిజర్వేషన్ల పరిమితికి సంబంధించిన న్యాయపరమైన అంశాలు ఉన్నప్పటికీ, బీసీలకు మరిన్ని అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు.

# జోన్-5

(నంద్యాల, కర్నూలు, హిందూపురం, అనంతపురం, కడప)

చైతన్యరథం




## బీసీల ద్రోహి వైసీపీకి ప్రజలే బుద్ధి చెబుతారు

**ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ భారీ ర్యాలీ, కార్యక్రమంలో పాల్గొన్న వేలాదిమంది పార్టీ శ్రేణులు, బీసీ నాయకులు**

అనంతపురం (చైతన్యరథం): బీసీలకు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యత లేకుండా చేస్తున్న వైసీపీకి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి ఖరారు చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సందర్భంగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో టవర్ క్లాక్ సర్కిల్ వద్ద ఈ భారీ ర్యాలీ ప్రారంభమైంది. వేలాదిమంది బీసీ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. టవర్ క్లాక్ నుంచి ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వరకు ఈ ప్రదర్శన సాగింది. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ బీసీలంటే టీడీపీ, టీడీపీ అంటే బీసీలన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచే స్వర్గీయ ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ ప్రాధాన్యతను కల్పించారని గుర్తుచేశారు. 1987లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు ఇస్తే, 1995లో సీఎం చంద్రబాబు నాయుడు వాటిని 34 శాతానికి పెంచారని వివరించారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ రిజర్వేషన్లను 24 శాతానికి కుదించి, దాదాపు 11 వేల మంది బీసీలకు పదవులు లేకుండా ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. 34శాతం రిజర్వేషన్ల కోసం తాము హైకోర్టు, సుప్రీంకోర్టులకు వెళ్లినా వైసీపీ అడ్డుకుందని విమర్శించారు. కోర్టుల ద్వారా అడ్డుకున్నా.. పార్టీ పరంగా బీసీలకు 34శాతం రిజర్వేషన్ ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో శ్రీకాకుళంలో అచ్చెన్నాయుడు నుంచి పెనుకొండలో సవిత వరకు ఎంతో మంది బీసీలను మంత్రులను చేశారని, అనంతపురం జిల్లాలో ఇద్దరు ఎంపీ స్థానాలు, జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కూడా బీసీలకే ఇచ్చి గౌరవించామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తూ వారి వెంట నడుస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బీసీల ఆరాధ్యుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కోర్టుల ద్వారా చట్టబద్ధంగా ఇబ్బందులు సృష్టించాలని వైసీపీ చూసినప్పటికీ, సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం ప్రాతినిధ్యం కల్పించి తీరుతుందని స్పష్టం చేశారు. గతంలో బీసీ సబ్ ప్లాన్ ద్వారా కూడా బీసీలకు న్యాయం చేశామని గుర్తుచేశారు. బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరించిన వైసీపీకి రాబోయే రోజుల్లో బీసీ సమాజం గట్టి బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. బీసీలు ఎక్కడున్నా సరే వారికి టీడీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉండి న్యాయం చేస్తుందన్నారు.

## పట్టిసీమతో వేల కోట్ల సంపద సృష్టి

**రాష్ట్ర ఐడీసీ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని వెల్లడి**

ఇబ్రహింపట్నం (చైతన్యరథం): ఇబ్రహింపట్నం పవిత్ర సంగమం వద్ద జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అంకెం ఇందిరా ప్రియదర్శిని పాల్గొని ప్రసంగించారు. పవిత్ర గోదావరి జలాలు కృష్ణ నదిలో పవిత్ర సంగమం వద్ద కలుస్తున్నాయని, ఇప్పటికే 500 టీఎంసీల గోదావరి జలాలు కృష్ణలో కలిశాయని ఆమె తెలిపారు. ఈ జలాలు కృష్ణ డెల్టా, రాయలసీమ ప్రాంతాలకు చేరి సుమారు 50 వేల కోట్ల రూపాయల సంపద సృష్టిస్తున్నాయని, తాగునీరు, సాగునీటి అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణ పరిసర ప్రాంతాల రైతులు, రాయలసీమ రైతులు ఈ జలాల వల్ల సంతోషంగా ఉన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 24 నెలల్లోనే సాగునీటి రంగానికి అనేక నిధులు కేటాయించిందని, 24 వేల కోట్ల రూపాయలతో వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ పూర్తి చేసి ఉత్తరాంధ్రకు తాగు, సాగు నీరు అందించిందని ఆమె వివరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు.

అన్నమయ్య డ్యాం గేటు కొట్టుకుపోయి 39 గ్రామాలు మునిగిపోయి ప్రజలు ప్రాణాలు కోల్పోయినా పట్టించుకోలేదని, ప్రధాన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల గేట్లకు గ్రీజ్ పెట్టకుండా, అవసరమైన మరమ్మతులు చేయకుండా మూలన పడేశారని విమర్శించారు.

ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి రైతులను ముంచారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లిఫ్ట్, మేజర్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు కోట్ల రూపాయలు వెచ్చించి పనులు వేగవంతం చేసిందని, వెలిగొండ, హంద్రీనీవా, గాలేరు-నగరి వంటి కీలక రాయలసీమ ప్రాజెక్టులు, పోలవరం తదితర ప్రాజెక్టుల పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నారని ఆమె తెలిపారు. రైతుల పంటలకు కావాల్సిన సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు కృష్ణలో కలవడం వల్ల కృష్ణ డెల్టా సశ్యశ్యామలంగా ఉందని, ఈ ప్రాంత రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నాడు జగన్ రెడ్డి పట్టిసీమను దండగ అని మాట్లాడారు, నేడు అదే పట్టిసీమ గోదావరి, కృష్ణ డెల్టాకు వరప్రదాయిని అయిందని ఆమె వ్యాఖ్యానించారు.




## టీడీపీలో బీసీలకు అగ్రతాంబూలం

**గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ వెల్లడి**



గుంటూరు (చైతన్యరథం): బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదని, బీసీలంటే వెన్నంటి నిలిచే వర్గాలని నిరూపించింది తెలుగుదేశం పార్టీనేనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం స్థానిక తూర్పు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్న నందమూరి తారక రామారావు నుంచి సీఎం చంద్రబాబు నాయుడు వరకు తెలుగుదేశం పార్టీల బీసీల పక్షపాతిగా ఉందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని అన్నారు. అయినప్పటికీ కమిషన్ ఆధారంగా తెలుగుదేశం పార్టీ 34 శాతం బీసీలకు టికెట్లు ఇవ్వాలని నిర్ణయించిందని, ఇది చారిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. బీసీలకు తెలుగుదేశం పార్టీ 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ముందడుగు వేస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తొలి నుంచి కూడా అడ్డుకుంటూనే ఉందని మండిపడ్డారు. బీసీలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చిన్నచూపేనన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగానీ, ఇతర పదవుల్లోగానీ ఒక్కరైనా బీసీలు ఉన్నారా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ నుంచి స్పీకర్ గా అయ్యన్నపాత్రులు, పార్టీ అధ్యక్షులుగా పల్లా శ్రీనివాసరావు, కేంద్ర మంత్రిగా రామ్మోహన్ నాయుడు ఇలా బీసీలకు అగ్రతాంబూలమిచ్చామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గుంటూరు నగరంలో తెలుగుదేశం పార్టీ తరపున ఎక్కువ మంది బీసీ మిత్రులే పోటీ చేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఓపెన్ కేటగిరీ స్థానాల్లోనూ బీసీలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు తెలుగుదేశం పార్టీ సుముఖంగా ఉందని చెప్పారు. బీసీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు వెన్నంటి నిలుస్తామని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు బీసీల తరపున ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్, నియోజకవర్గ బీసీ సంఘ అధ్యక్షుడు తాడిబోయిన బుజ్జి, యల్లావుల అశోక్, గాలి సతీష్, చల్లా ఆంజనేయప్రసాద్, కందుకూరి వెంకట్, బీసీల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే బీసీల అభ్యున్నతి



గుంటూరులోని కనకమేడల కన్వెన్షన్‌లో తాడికొండ శాసనసభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్ అధ్యక్షతన బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, సాధికారత, పార్టీ పరంగా కల్పించాల్సిన అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ బీసీల అభ్యున్నతికి మొదటి నుంచి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. బీసీలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పించడం, నాయకత్వ అవకాశాలను పెంపొందించడం పార్టీ లక్ష్యమని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతానికి మించి పార్టీ టికెట్లు కేటాయించి, వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంపొందించేందుకు ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన నిర్ణయం బీసీలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా కీలకమని పేర్కొన్నారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, బీసీ నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తూ వారి అభ్యున్నతికి అండగా నిలుస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ సాధికారతకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు క్రియాశీలక పాత్ర పోషించేలా సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# చల్ రే చల్...

**సౌదీలో దుర్భరంగా భారతీయుల దుస్థితి-ప్రత్యేక ఆపరేషన్లతో ఉక్కుపాదం**

**33 వేల మందిపై కేసులు- 14 వేల మంది అరెస్ట్- 10,431 మంది దేశ బహిష్కరణ**

**ఇఖామా, బోర్డర్ సెక్యూరిటీ, లేబర్ రూల్స్ అతిక్రమణదారులపై పంజా**

**ఆశ్రయం, రవాణా, ఉద్యోగం ఇస్తే 15 ఏళ్ల జైలుశిక్ష, రూ.2.2 కోట్ల భారీ జరిమానా**



**సౌదీఅరేబియా:** సౌదీ అరేబియా వ్యాప్తంగా చట్ట విరుద్ధంగా నివసిస్తున్న విదేశీయులు, కార్మిక, సరిహద్దు భద్రతా నిబంధనలను ఉల్లంఘించిన వారిపై అక్కడి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. సౌదీ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భద్రతా బలగాలు నిర్వహించిన సంయుక్త తనిఖీల్లో కేవలం వారంరోజుల వ్యవధిలోనే చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్లలో దాదాపు 14,000 మందిని అరెస్టు చేశారు. 10,431 మందిని ఇప్పటికే స్వదేశాలకు బహిష్కరించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలు, నగరాలు, పని ప్రదేశాల్లో ఈ ముమ్మర ఆపరేషన్లు కొనసాగాయి. చట్టవిరుద్ధంగా నివసిస్తున్న వారికి రవాణా, ఆశ్రయం లేదా ఉపాధి కల్పిస్తే 15 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు 10 లక్షల రియాళ్ల వరకు భారీ జరిమానా, ఆస్తుల జప్తు వంటి కఠిన చర్యలు ఉంటాయని సౌదీ హోం శాఖ హెచ్చరించింది. మిగిలిన ఉల్లంఘనులకు రాయబార కార్యాలయాల ద్వారా ట్రావెల్ డాక్యుమెంట్లు సిద్ధం చేసి డిపోర్ట్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది.

**నివాస, సరిహద్దు, కార్మిక చట్టాల ఉల్లంఘనలు**

తాజా నివేదిక ప్రకారం అరెస్టయిన వారిలో అత్యధికులు రెసిడెన్సీ చట్టాలను (ఇఖామా నిబంధనలు) ఉల్లంఘించిన వారే ఉన్నారు. వీటితో పాటు సరిహద్దు భద్రతా నియమాలు, కార్మిక చట్టాల పరిధిలోని పలు నిబంధనలను అతిక్రమించిన వేలాది మందిని అధికారులు గుర్తించారు. చెల్లుబాటు అయ్యే నివాస అనుమతులు లేకపోవడం, స్పాన్సర్ల పరిధిని దాటి బయట అక్రమంగా పనిచేస్తుండటం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకున్నారు.

**సరిహద్దుల్లో చొరబాటు యత్నాల భగ్నం**

సౌదీ సరిహద్దుల గుండా అక్రమంగా దేశంలోకి ప్రవేశించేందుకు యత్నించిన వందలాది మందిని భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నాయి. ఇలా సరిహద్దులను దాటేందుకు ప్రయత్నించిన వారిలో ప్రధానంగా ఇథియోపియా, యెమెన్ దేశాల పౌరులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అదే విధంగా సౌదీ సరిహద్దుల నుంచి ఇరుగుపొరుగు దేశాలకు అక్రమ మార్గాల్లో పారిపోయేందుకు యత్నించిన వారిని కూడా అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.

**స్వదేశాలకు పంపే ప్రక్రియ**

అరెస్టు చేసిన వారిలో చట్టప రమైన ప్రక్రియ పూర్తయిన 10,431 మందిని కేవలం వారం రోజుల్లోనే స్వదేశాలకు బహిష్క రించారు. మిగిలిన వేలాది మందిని సంబంధిత విదేశీ రాయబార కార్యాలయాల ద్వారా ప్రయాణ పత్రాలు సిద్ధం చేసేందుకు ఆయా డిపోర్టేషన్ సెంటర్లలో ఉంచారు. విమాన టికెట్ల రిజర్వేషన్లు పూర్తయిన వెంటనే వారందరినీ దశల వారీగా వారి స్వదేశాలకు తరలించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

**సహకరిస్తే 15 ఏళ్ల జైలు,**
**రూ.2.2 కోట్ల భారీ జరిమానా**

అక్రమంగా నివసిస్తున్న విదేశీయులకు ఆశ్రయం కల్పించినా, రవాణా సదుపాయాలు సమకూర్చినా, లేదా ఉద్యోగాలు ఇచ్చి సహకరించినా అత్యంత కఠినమైన శిక్షలు తప్పవని సౌదీ హోంమంత్రిత్వ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఉల్లంఘనులకు తోడ్పడే వ్యక్తులకు గరిష్ఠంగా 15 సంవత్సరాల వరకు జైలు శిక్ష, 10 లక్షల సౌదీ రియాళ్లు (సుమారు రూ. 2.2 కోట్లు) వరకు భారీ జరిమానా విధిస్తారు. అదనంగా వారి నేరాలకు ఉపయోగించిన రవాణా వాహనాలు, అద్దెకు ఇచ్చిన నివాస ప్రాంగణాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

**జాతీయ భద్రత, ఆర్థిక క్రమశిక్షణే ధ్యేయం**

విదేశీయులు సౌదీ చట్టాలను గౌరవించాలని, లైసెన్స్ పొందిన సరైన పద్ధతుల్లోనే ఉపాధి పొందాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అనుమానాస్పద లేదా అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ల ద్వారా అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. జాతీయ భద్రతను కాపాడటంతో పాటు అనధికార శ్రామిక మార్కెట్‌ను నియంత్రించి పారదర్శకమైన ఆర్థిక వాతావరణాన్ని నెలకొల్పేందుకే ఈ నిరంతర ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు సౌదీ యంత్రాంగం తేల్చి చెప్పింది.

**పనుల నుంచి తొలగిస్తుండటంతో**
**బిక్కుబిక్కుమంటున్న భారతీయులు**

సౌదీ అరేబియాలో అధికారులు చేపడుతున్న మెగా క్రాక్‌డౌన్‌తో అక్కడ చిన్నచిన్న కిరాణా కొట్లు, వర్క్‌షాపులు, హోటళ్లలో చిరుద్యోగాలు చేసుకుంటున్న వేలాదిమంది ప్రవాస భారతీయులు తీవ్ర భయాందోళనల్లో గడుపుతున్నారు. ఇఖామా గడువు ముగిసి సరైన పత్రాలు లేక అక్రమంగా తలదాచుకుంటున్న వారు, స్పాన్సర్లతో చిన్నపాటి వివాదాలు లేదా తప్పుడు ఫిర్యాదులు (హురూబ్) నమోదైన పేద కార్మికులు ఏ క్షణాన పోలీసులు వచ్చి అరెస్టు చేస్తారోనని బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ఆశ్రయం లేదా పని కల్పించే వారికి 15 ఏళ్ల జైలు, భారీ జరిమానాలు విధిస్తామన్న హెచ్చరికలతో స్థానిక దుకాణదారులు సైతం వీరిని పనుల నుంచి తొలగిస్తుండటంతో స్వదేశానికి రాలేక అక్కడ తలదాచుకోలేక తీవ్రమైన మానసిక వేదనను అనుభవిస్తున్నారు.

## తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



**బర్న్‌హామ్, యునైటెడ్ కింగ్‌డమ్:** యునైటెడ్ కింగ్‌డమ్‌లోని తెలుగు సమాజానికి విశేష సేవలందిస్తున్న రిజిస్టర్డ్ ఛారిటీ, సాంస్కృతిక సంస్థ తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ (టీఏఎల్) తన వార్షిక సర్వసభ్య సమావేశం శనివారం బర్న్‌హామ్ గ్రామర్ స్కూల్‌లో నిర్వహించింది. కార్యవర్గం పదవీ కాలం ముగిసిన సందర్భంగా ప్రస్తుత అధ్యక్షుడు రవి సబ్బా, సభ్యులు, అసోసియేషన్ అభివృద్ధికి సహకరించిన అనిల్ అనంతుల, అశోక్ మడిశెట్టి, కిరణ్ కప్పేట, రవి మోచర్ల, సత్య పెదిరెడ్డి, వెంకట్ నీలా, ఇతర సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎన్నికల అధికారి రాధా మనోహర్ మాచెర్ల ఎన్నికల ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వీరు రాబోయే మూడేళ్లు నాయకత్వం వహించనున్నారు.

**అసోసియేషన్ నూతన కార్యవర్గం**

చైర్మన్‌గా వంశీమోహన్ శింగలూరి, వైస్ చైర్మన్‌గా గిరిధర్ పుత్తూరు, సభ్యులుగా సునీత అరిగె, సత్య పెదిరెడ్డి, వెంకట్ తోటకూర, లక్ష్మణ్ కోట, చెంగల్వరాయం బొప్పనతో పాటు వివిధ విభాగాలకు కొత్త ఇన్‌చా ర్జులుగా రాజేష్ తోలేటి(లిటరరీ), విజయ్ బెలిదే(ఫండ్ రైజింగ్), సునీల్ ఆలపాటి(ఫండ్ రైజింగ్), ప్రశాంతి తిరునగరి(కల్చరల్), శ్రీరామ్ సూరపనేని(టీసీసీ), సుభాష్ లోకసాని (టీసీసీ), రవి దేవనబోయిన(ఐటీ), మురళి కోట(ఐటీ), సింధూర చెరకు(స్పోర్ట్స్), అనిల్ ఏనుగు(స్పోర్ట్స్)లను నియమించారు.

**వ్యవస్థాపక సభ్యుల అభినందనలు**

టీఏఎల్ వ్యవస్థాపక సభ్యులు, సలహాదారులు శ్రీధర్ వనం, రాములు దాసోజు నూతన ధర్మకర్తల మండలికి అభినందనలు తెలిపారు. సంస్థ లక్ష్యాలను సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని శ్రీధర్ వనం కోరారు. తెలుగు సంస్కృతిని పరిరక్షించడం, యునైటెడ్ కింగ్‌డమ్‌లోని తెలుగు సమాజాన్ని మరింత బలోపేతం చేయడం కోసం కార్యక్రమాలను కొనసాగిస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. తెలుగు సమాజానికి మరింత సేవ చేయాలనే ఉమ్మడి సంకల్పంతో నూతన ధర్మకర్తల మండలి తన ప్రస్థానాన్ని ప్రారంభించింది.

### విద్యార్థులు, ఆపన్నుల కడుపు నింపిన

# వరల్డ్ ఫుడ్ మూవ్‌మెంట్

**న్యూజెర్సీ ఎసెక్స్ కౌంటీ కాలేజీలో భోజన సౌకర్యం: పాల్గొన్న సంస్థ ప్రతినిధి నవీన నీరద దాస, పారిశ్రామికవేత్త రాబర్ట్ వాద్రా**

**న్యూజెర్సీ:** ఎలాంటి లాభాపేక్ష ఆశించకుండా విద్యార్థులకు, పౌష్టికాహారం అందుబాటులో లేని వారికి వరల్డ్ ఫుడ్ మూవ్‌మెంట్ (డబ్ల్యూ ఎఫ్‌ఎం) న్యూజెర్సీలోని ఎసెక్స్ కౌంటీ కాలేజీలో భోజన కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త రాబర్ట్ వాద్రా దాతగా ఉండి విద్యార్థులకు భోజనం స్వయంగా వడ్డించి వారి తో సంభాషించారు. నిజానికి అమెరికాలో విద్యార్థులకు, రకరకాల సమాజాలకు పౌష్టికాహారం అందించేందుకు 2025లో వరల్డ్ ఫుడ్ మూవ్‌మెంట్ ప్రారంభమైంది. అక్షయ పాత్ర ఫౌండేషన్ నుంచే దీనిని స్ఫూర్తిగా తీసుకున్నారు. తన ఆవిర్భావం నుంచి న్యూజెర్సీ, న్యూయా ర్క్, శాన్ ఫ్రాన్సిస్కో బే ఏరియా, బోస్టన్, డల్లాస్, వాషింగ్టన్ డీసీ ప్రాంతాల్లోని వివిధ వర్గాలకు చెందిన విద్యార్థులు, ఆహార భద్రత లేని వారికి 70 వేల మందికి పైగా భోజనాలను అందించింది. మరింత చురుగ్గా ఉండి విద్యపై దృష్టిసారించడానికి ఈ కార్యక్రమం దోహద పడుతుందని అంటున్నారు.

**పోషకాహారంతో చదువుపై దృష్టి**
**- నవీన నీరద దాస**

వరల్డ్ ఫుడ్ మూవ్‌మెంట్, స్ట్రాటజీ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవీన నీరద దాస మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికరమైన భోజనం అందుబాటులో ఉంటే వారు చదువుపై, భవిష్యత్తుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టగలుగుతారు. ఎసెక్స్ కౌంటీ కాలేజీలోని ఈ కార్యక్రమం పౌష్టికరమైన ఆహారాన్ని అందించడం ద్వారా విద్యార్థులకు, సమాజాలకు మద్దతు ఇవ్వాలనే మా నిబద్ధతను ప్రతిబింబి స్తుందని తెలిపారు. సామాజిక నాయకుడు రాజేందర్ డిచ్‌పల్లితో కలిసి పారిశ్రామికవేత్త రాబర్ట్ వాద్రా విద్యార్థులకు భోజనం వడ్డించి వారితో



ముచ్చటించారు. రాబర్డ్ వాద్రా మాట్లాడుతూ ఒక పూట భోజనం విద్యార్థులకు అవసరమైన శక్తిని ఇస్తుంది. ఇది నాకు అద్భుతమైన అనుభూతి. వరల్డ్ ఫుడ్ మూవ్‌మెంట్‌లో భాగం కావడం నాకు సంతోషాన్నిస్తోంది. నేను ఎక్కడికి వెళ్లినా నా శక్తిమేర సహాయం చేస్తూనే ఉంటాను అని హామీ ఇచ్చారు.




**విద్యార్థులకు ఆహారం అందించడంలో సఫలం అయ్యాం: బోయాకీ**

ఎసెక్స్ కౌంటీ కాలేజ్ అధ్యక్షుడు డాక్టర్ అగస్టిన్ ఎ.బోయాకీ మాట్లాడుతూ విద్యార్థికి, చదువుకి మధ్య అనేక అడ్డంకులు ఉన్నాయి. అందులో ఆహారం కూడా ఓ సమస్యే. ఆ అడ్డంకిని తొలగిస్తే విద్యార్థులు కడుపు నిండా భోజనం చేసి తమ చదువులో ముందుకుసాగడానికి పుష్కలంగా అవకాశం ఉంది. అంతేకాకుండా పౌష్టికాహారం స్వీకరించడం ద్వారా మెదడు చురుగ్గా పనిచేయడంతో పాటు విద్య బాగా వస్తుంది. ఇలా ఆహారం విద్యార్థులకు అందించ డంలో మేము కొంతమేర సఫలం అయ్యాం. ప్రస్తుతం ఇది ఒక చిన్న ప్రాజెక్టుగా అనిపించ వచ్చు. కానీ చాలా తక్కువ సమయంలోనే ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిపొందిన విద్యార్థులు ఈ కార్యక్రమం వల్లే నేను నా డిగ్రీని పూర్తి చేయ గలిగాను అని చెప్పుకోగలుగుతారు అని పేర్కొన్నారు.

**10 లక్షల భోజనాలు లక్ష్యం**

వరల్డ్ ఫుడ్ మూవ్‌మెంట్ అమెరికాలోని పలు ప్రాంతాలలో భోజన సదుపాయం కల్పించే కార్యక్రమాలను ప్రారంభించింది. మరిన్ని ప్రాంతాలకు తన కార్యకలాపాలను విస్తరించే దిశగా కృషి చేస్తూ వచ్చింది. 2030 నాటికి అమెరికాలో 10 లక్షల (ఒక మిలియన్) భోజనాలను అందించాలని ఆ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఉదయం లేవగానే పిల్లలు పౌష్టికాహారం గురించి ఆలోచించకుండా, వారిపై భారకం పడకుండా శ్రద్ధగా విద్యార్థులు తమ చదువును కొనసాగించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. మరీ ముఖ్యంగా కమ్యూనిటీ కాలేజీ విద్యార్థులు, ఆహార భద్రత లేని విద్యార్థులకు సరైన ఆహారం అందించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఎసెక్స్ కౌంటీ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమం ఆహార భద్రత లేమిపై అవగాహన కల్పించడం, పౌష్టికాహారం పొందే అవకాశాలను కమ్యూనిటీ స్థాయిలో విస్తరించడం కోసం చేపట్టిన విస్తృత ప్రయత్నంలో ఒక భాగం.



# ప్రభుత్వాలు మారినా.. తమిళనాడుపై నా నిబద్ధత మారదు

**సీఎం విజయ్‌తో కలిసి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తాం.. - చెన్నై మెట్రో ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు**

చెన్నై: తమిళనాడులో ప్రభుత్వాలు మారినప్పటికీ ఆ రాష్ట్ర అభివృద్ధి, ప్రజలకు సేవ చేయడంపై తన నిబద్ధత మారదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి తమిళనాడు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని ప్రకటించారు. ఆదివారం చెన్నైలో పూందమల్లి-వడపళని మెట్రో కారిడార్‌ను సీఎం విజయ్‌తో కలిసి ప్రారంభించిన ప్రధాని.. రాష్ట్రంలో రూ.13 వేల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసి, పూర్తయిన కొన్ని పనులను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ కూడా పాల్గొన్నారు. "తమిళనాడు చరిత్రలో ఈరోజు ఒక ముఖ్యమైన రోజు. రవాణా, పరిశ్రమలు, వాణిజ్యం, మౌలిక సదుపాయాల రంగాల్లో రూ.13 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. కొన్ని ప్రాజెక్టులను ప్రారంభించగా.. మరికొన్నింటికి శంకుస్థాపనలు చేశాం. ఈ పనులు రాష్ట్ర యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తాయి" అని మోదీ పేర్కొన్నారు.

గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి తమిళనాడు నేతలతో కలిసి పనిచేసిన అనుభవాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. అప్పట్లో కరుణానిధి, జయలలిత వంటి ముఖ్యమంత్రులతో కలిసి పనిచేశానని చెప్పారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జయలలిత, పన్నీర్ సెల్వం, పళనిస్వామి, ఎం.కె. స్టాలిన్ ప్రభుత్వాలతోనూ పనిచేసినట్లు తెలిపారు. "ప్రభుత్వాలు మారాయి. కానీ తమిళనాడు అభివృద్ధి, ఇక్కడి ప్రజలకు సేవ చేయాలన్న నా దృక్పథం మారలేదు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాల ఆకాంక్షలు, ప్రజల అవసరాలు ఎలా ఉంటాయో నాకు తెలుసు.

ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వాటిని నెరవేర్చేందుకు ప్రయత్నిస్తున్నా. ప్రతి రాష్ట్రం తనదైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించాలి" అని మోదీ అన్నారు. కాగా, పూందమల్లి-వడపళని మెట్రో మార్గాన్ని ప్రారంభించిన అనంతరం ప్రధాని మోదీ, సీఎం విజయ్ కలిసి రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మోదీ మెట్రో టికెట్ కొనుగోలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# అమెరికా సీనియర్ కమాండర్ ఎదుటే

**ఎఫ్-35పై ఐఏఎఫ్ చీఫ్ సింగ్ చురకలు**




అధునాతన ఎఫ్-35 యుద్ధ విమానాలను విక్రయించేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. అయినప్పటికీ ఈ విషయంలో ఒప్పందం కుదరకపోవడంపై భారత వైమానిక దళం చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జోధ్‌పూర్‌లో జరిగిన 'తరంగ్ శక్తి-2026' ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ.. అమెరికాకు చెందిన ఎఫ్-35 యుద్ధవిమానాల దగ్గరకు కూడా భారత అధికారులను ఆ దేశ సిబ్బంది రానివ్వరని వ్యాఖ్యానించారు. కానీ, దానిని భారత్‌కు విక్రయించడం గురించి మాత్రం మాట్లాడుతుంటుందని అమెరికాకు చురకలు అంటించారు. ఆయన ఈ వ్యాఖ్యలు చేసినప్పుడు యూఎస్ పసిఫిక్ ఎయిర్ ఫోర్సెస్ కమాండర్ జనరల్ కెవిన్ ఆయన పక్కనే ఉండడం గమనార్హం. తమ ఐదో తరం ఎఫ్-35 యుద్ధ విమానాలను భారత్‌కు విక్రయించేందుకు అమెరికా ఏదైనా అధికారిక ప్రతిపాదన చేసిందా అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. ఐఏఎఫ్ చీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎఫ్-35 విషయంలో అగ్రరాజ్యం నుంచి ఎటువంటి అధికారిక ప్రతిపాదన అందలేదని స్పష్టం చేశారు. రష్యా తమ ఐదోతరం అత్యాధునిక స్టెల్త్ యుద్ధ విమానం సుఖోయ్ ఎస్ యూ-57ను భారత్‌కు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అయితే ఆ విమానాన్ని కొనుగోలు చేయాలా వద్దా అనే విషయంపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కాగా, జోధ్‌పూర్‌లో 'తరంగ్ శక్తి-2026' పేరుతో నిర్వహించిన యుద్ధ విమానాల విన్యాసాలలో భారత వైమానిక దళంతో పాటు మరో ఏడు దేశాలకు చెందిన వైమానిక దళాలు పాల్గొన్నాయి.

# 'బ్రేకప్ చెప్పిందని.. లోయలోకి తోసేశాడు'



ప్రియురాలు బ్రేకప్ చెప్పడంపై ప్రియుడు ఆగ్రహించి.. ఆమెను లోయలోకి తోసేశాడు. దర్యాప్తులో అసలు విషయాన్ని బహిర్గతం చేశారు పోలీసులు. మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గార్గోటిలోని అవధూత్ కాలనీకి చెందిన 25 ఏళ్ల శ్రీపాద్ దింకర్, ఎదురింట్లో నివసించే 23 ఏళ్ల తరణ్ణుమ్ బషీర్ నాయక్ ప్రేమించుకున్నారు. మహగావ్‌లోని కాలేజీలో ఆమె ఇంజినీరింగ్ చదువుతున్నది. ఇటీవల తరణ్ణుమ్‌కు ఒక వ్యక్తితో పెళ్లి సంబంధం నిశ్చయమైంది. దీంతో శ్రీపాద్‌తో సంబంధాన్ని కొనసాగేందుకు ఆమె నిరాకరించింది. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. కాగా, అక్టోబర్ 9న తరణ్ణుమ్‌కు శ్రీపాద్ ఫోన్ చేశాడు. నాయక్‌వాడిలోని లోతైన లోయ సమీప ప్రాంతానికి ఆమెను తీసుకెళ్లాడు. తనకు వివాహం నిశ్చయమైందని, ఇకపై తమ సంబంధాన్ని కొనసాగించలేమని ఆమె అతడికి చెప్పింది. తరణ్ణుమ్ నిర్ణయంపట్ల శ్రీపాద్ ఆగ్రహించాడు. ఆమెను లోయలోకి తోసేయడంతో మరణించింది. తర్వాత భుదర్‌గఢ్ పోలీస్ స్టేషన్‌కు శ్రీపాద్ వెళ్లాడు. తరణ్ణుమ్ అదృశ్యమైనట్లు తొలుత చెప్పాడు. పోలీసులు అతడిని ప్రశ్నించగా చివరకు ఆమెను లోయలోకి తోసేసినట్లు ఒప్పుకుని లొంగిపోయాడు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. యువతి మృతదేహాన్ని గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీపాద్‌ను అరెస్ట్ చేశారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# నిరసనలతో ఢిల్లీలో మళ్లీ ఉద్రిక్తత

- **షరతులతో సీజేపీ టాప్‌లీడర్స్ విడుదల**
- **సీఈసీని కాపాడేందుకు ప్రజలతో యుద్ధమా: సీజేపీ**
- **ఖర్గే, రాహుల్ గాంధీ సీజేఐకి లేఖ**
- **సీజేఐని కలవనున్న కాంగ్రెస్ అగ్రనేతలు..**
- **జంతర్ మంతర్ వద్ద భారీ భద్రత**
- **ఆందోళనకారులపై 20 కేసులు నమోదు**
- **ఆమె మరణవార్తను ముందే తెలిపామన్న పోలీసులు**





**నిరసనకారులపై 20 కేసులు నమోదు**

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతున్నాయి. కన్నాట్ ప్లేస్‌లో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు, సీఈసీ నిర్ణయాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు లేఖ రాసినట్లు వెల్లడించారు. సోమవారం సాయంత్రం ఆయనను కలిసి ఎన్నికల సంఘం నిర్ణయాలు, ఓట్ల తొలగింపు అంశాలపై జోక్యం చేసుకోవాలని కోరనున్నట్లు ఖర్గే తెలిపారు. శనివారం ఢిల్లీలో అప్రకటిత అత్యవసర పరిస్థితి నెలకొందని, ఆంక్షలు ఆదివారం కూడా కొనసాగుతున్నాయని ఖర్గే విమర్శించారు. ప్రధాని, హోంమంత్రి కలిసి నగరంలో గందరగోళ పరిస్థితులు సృష్టించారని ఆరోపించారు. 32 వేల మంది పోలీసులు, 7,500 మంది సీఆర్పీఎఫ్ సిబ్బందిని మోహరించడం యువత ఆందోళనల పట్ల ప్రభుత్వ భయానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**షరతులతో సీజేపీ నేతల విడుదల**

సీఈసీ రాజీనామా కోరుతూ శనివారం జంతర్ మంతర్ వద్ద నిరసనకు దిగిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం దిల్లీ కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్‌లోని ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఏడాదిపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాల్లో పాల్గొనకూడదనే షరతుతో వారిని విడుదల చేసినట్లు సీజేపీ నేత రత్నాసింగ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

**రెండో రోజూ కట్టుదిట్టమైన భద్రత**

జంతర్ మంతర్ వద్ద ఆదివారం కూడా నిరసనలు జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. 30 వేల మందికి పైగా పోలీసు, పారామిలిటరీ సిబ్బందిని మోహరించినట్లు సమాచారం.

ఢిల్లీ సరిహద్దులు, రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినళ్లు, ఇతర సున్నిత ప్రాంతాల్లో నిఘా పెంచారు. కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఢిల్లీ పోలీసులకు సహకరిస్తున్నాయి. న్యూఢిల్లీని 20 జోన్లుగా విభజించి ఉన్నతాధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు, లాడ్జీల్లో తనిఖీలు చేపట్టడంతోపాటు సోషల్ మీడియాపైనా నిఘా ఉంచారు.

**సీఈసీని కాపాడేందుకు ప్రజలతో యుద్ధమా: సీజేపీ**

తమను పోలీసులు బలవంతంగా విమానంలో నుంచి అదుపులోకి తీసుకున్నారని, ఫోన్లు స్వాధీనం చేసుకుని న్యాయవాదిని సంప్రదించే అవకాశం ఇవ్వలేదని సౌరవ్ దాస్ ఆరోపించారు. విడుదల అనంతరం మీడియాతో మాట్లాడుతూ, జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకే ప్రభుత్వం ఈ చర్యలకు దిగుతోందని విమర్శించారు.

పోరాటం నుంచి వెనక్కి తగ్గేది లేదన్నారు. అశుతోష్ రాంకా కూడా ఢిల్లీలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు కనిపించాయని ఆరోపించారు. రైళ్లు, ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు.

శనివారం నాటి నిరసనలకు సంబంధించి 20 కేసులు నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. భద్రతా సిబ్బందిపై దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం వంటి ఆరోపణలతో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. విద్యార్థులపై దాడి, మహిళలను దుర్భాషలాడినట్లు వచ్చిన ఆరోపణలపై అదుపులోకి తీసుకున్న నలుగురిపైనా కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఘటనల్లో 15 మందికి పైగా పోలీసు సిబ్బంది గాయపడినట్లు వెల్లడించారు.

**దీప్కే నానమ్మ మరణవార్త తెలిపాం: పోలీసులు**

అభిజీత్ దీప్కేకు ఆయన నానమ్మ మరణవార్త తెలియజేయలేదన్న ఆరోపణలను ఢిల్లీ పోలీసులు ఖండించారు. సమాచారం అందిన వెంటనే మరణవార్తతోపాటు అంత్యక్రియల సమయం గురించి కూడా తెలిపామని డీసీపీ నేహా యాదవ్ వెల్లడించారు. అంత్యక్రియలకు వెళ్లేందుకు ప్రయాణ ఏర్పాట్లలో సహాయం చేస్తామని, కుటుంబ సభ్యులతో మాట్లాడే అవకాశం కల్పించామని చెప్పారు. అయితే, ఆ సహాయాన్ని స్వీకరించేందుకు దీప్కే నిరాకరించారని తెలిపారు. ఈ వివరాలకు సంబంధించిన వీడియోను పోలీసులు ఆదివారం విడుదల చేశారు. దీప్కే తల్లి, సీజేపీ చేసిన ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఈ వివరణ ఇచ్చారు.

# జిబూటి తీరంలో ఘోర పడవ ప్రమాదం



## 109 మంది మృతి.. 116 మంది గల్లంతు

ఆఫ్రికా దేశమైన జిబూటి తీరంలో ఘోర పడవ ప్రమాదం చోటుచేసుకుంది. వలసదారులతో ప్రయాణిస్తున్న పడవ బోల్తా పడటంతో 109మంది ప్రాణాలు కోల్పోగా, మరో 116 మంది గల్లంతయ్యారు. ప్రమాదం నుంచి 80 మంది సురక్షితంగా బయటపడ్డారు. ఈ వివరాలను ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ ఆదివారం వెల్లడించింది.

సుమారు 350 మంది వలసదారులతో కూడిన పడవ జిబూటి నుంచి యెమెన్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో ఉత్తర ఒబోక్ ప్రాంతంలోని గుహెరో సమీపంలో అక్టోబర్ 8, 9 తేదీల మధ్య రాత్రి పడవ బోల్తా పడినట్టు సమాచారం. దీంతో అందులో ప్రయాణిస్తున్న వారు సముద్రంలో పడిపోయారు. దుర్ఘటనలో 109 మంది మరణించగా, పలువురు ఆచూకీ ఇంకా లభించలేదు. మృతుల్లో 15 మంది చిన్నారులున్నట్టు అధికారులు వెల్లడించారు. అలాగే 52 మంది పురుషులు, 42 మంది మహిళలు ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గురైన వారంతా ఇథియోపియాకు చెందిన వలసదారులుగా గుర్తించారు. మెరుగైన జీవనోపాధి, భవిష్యత్తుపై ఆశలతో ప్రమాదకరమైన సముద్ర మార్గంలో ప్రయాణిస్తున్న వలసదారులు ఈ దుర్ఘటనలో తీవ్రంగా నష్టపోయారు. ఘటనపై ఇథియోపియా ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. పడవ ప్రమాదానికి గల కారణాలు, గల్లంతైన వారి ఆచూకీ, మృతుల సంఖ్యపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# పులి ఎన్‌క్లోజర్‌లోకి దూకిన వ్యక్తి మృతి

### ఇంగ్లాండ్ వైల్డ్‌లైఫ్ పార్క్‌లో విషాదం!



ఇంగ్లాండ్‌లోని యార్క్‌షైర్ వైల్డ్‌లైఫ్ పార్క్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. పులుల ఎన్‌క్లోజర్‌లోకి ప్రవేశించిన ఓ వ్యక్తిపై పులి దాడి చేయడంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. శనివారం మధ్యాహ్నం సమయంలో ఈ ఘటన చేటుచేసుకున్నట్టు సౌత్ యార్క్‌షైర్ పోలీసులు వెల్లడించారు. అత్యవసర వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స అందించినప్పటికీ, అతడిని కాపాడలేకపోయారు.

**ఎన్‌క్లోజర్‌లోకి ఎలా వెళ్లాడు?**

ప్రాథమిక సమాచారం ప్రకారం, సదరు వ్యక్తి పులుల ఎన్‌క్లోజర్‌లోకి ప్రవేశించడంతో ఈ ప్రమాదం జరిగింది. అయితే అతడు లోపలికి ఎలా వెళ్లగలిగాడన్న విషయంపై స్పష్టత లేదు. ఘటన జరిగిన వెంటనే పార్కు సిబ్బంది అత్యవసర చర్యలు చేపట్టగా, పోలీసులు, వైద్య సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మృతుడి గుర్తింపును అధికారులు బహిరంగంగా వెల్లడించలేదు. అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు.

**పులికి గాయాలు కాలేదు**

ఈ ఘటన నేపథ్యంలో వైల్డ్‌లైఫ్ పార్కును ఖాళీ చేయించి, ఆదివారం కూడా మూసివేశారు. పులిపై కాల్పులు జరిపారంటూ వస్తున్న వార్తలపై అధికారులు స్పష్టత ఇచ్చారు. దాడికి పాల్పడిన పులి గాయపడలేదని, అది ఎన్‌క్లోజర్‌లోనే ఉందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి అదనపు ప్రమాదం లేదని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే అవి బాధిత కుటుంబానికి మరింత ఆవేదన కలిగించే అవకాశం ఉందని పేర్కొంటూ, ఆ వీడియోలను షేర్ చేయవద్దని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు కొనసాగుతోంది.

# ఇజ్రాయెల్‌కు కొత్త అధ్యక్షుడు అవసరం

**- జెలెన్‌స్కీపై ఆగ్రహంతో ట్రంప్ సంచలన వ్యాఖ్యలు**

**- రష్యాతో అమెరికా డీజిల్ ఒప్పందంపై జెలెన్‌స్కీ కినుక**



రష్యా నుంచి డీజిల్ కొనుగోలుకు అమెరికా ఒప్పందం కుదుర్చుకోవడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఒప్పందానికి సహకరించినందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఈ నిర్ణయంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్‌స్కీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రష్యాకు ఆర్థికంగా సహకరించడం ద్వారా తమ దేశంపై మరిన్ని దాడులకు అవకాశం కల్పించినట్లవుతుందని విమర్శించారు. డీజిల్ కొనుగోలుపై జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలతో ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌కు కొత్త అధ్యక్షుడు అవసరమని సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యాతో శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు జెలెన్‌స్కీకి అనేక అవకాశాలు వచ్చినప్పటికీ, కొన్ని కారణాలతో వాటికి అంగీకరించలేదని ఆరోపించారు. ఆయన వ్యవహారశైలి ప్రపంచానికి సమస్యలు సృష్టిస్తోందని విమర్శించారు. చమురు కొరత కారణంగా అమెరికాలో రైతులు, పాడి పరిశ్రమపై ప్రభావం పడకుండా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మరోవైపు, రష్యా తమ దేశంలోని జపోరిజియా ప్రాంతంతో పాటు రాజధాని కీవ్‌పై కూడా దాడులు చేసిందని జెలెన్‌స్కీ ఆరోపించారు. అమెరికా ఆంక్షల సడలింపు రష్యాకు ప్రయోజనం చేకూరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధం కారణంగా ఉక్రెయిన్ భారీగా నష్టపోయిందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ యుద్ధం మొదలుకాకుండా ఉండాల్సిందని వ్యాఖ్యానిస్తూ, రష్యా-ఉక్రెయిన్ మధ్య వివాదానికి ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు. తాజా పరిణామాలతో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు, శాంతి చర్చలపై మరోసారి చర్చ మొదలైంది.



# నేపాల్‌లో మళ్లీ వరద బీభత్సం

### ఇళ్లు, వంతెనలు గల్లంతు.. లోతట్టు ప్రాంతాలకు హెచ్చరికలు

నేపాల్‌ను మరోసారి ఆకస్మిక వరదలు వణికించాయి. గోర్ఖా జిల్లాలోని బుధిగండకి నదికి ఒక్కసారిగా వరద పోటెత్తడంతో పలు గ్రామాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. నదీ ప్రవాహానికి ఇళ్లు, వంతెనలు కొట్టుకుపోగా, జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతం కూడా దెబ్బతింది. గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. గోర్ఖా జిల్లాలోని చుమ్నుబ్రి గ్రామీణ మున్సిపాలిటీ పరిధిలో కొండచరియలు విరిగిపడి నదికి ఉపనదిగా ఉన్న ప్రవాహానికి అడ్డంకి ఏర్పడినట్లు అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అడ్డుగా నిలిచిన నీరు ఒక్కసారిగా దిగువకు ప్రవహించడంతో బుధిగండకి నదిలో వరద ఉద్ధృతి పెరిగినట్టు అంచనా వేస్తున్నారు. అయితే, ప్రమాదానికి కచ్చితమైన కారణంపై అధికారులు ఇంకా పరిశీలన చేస్తున్నారు.

**ఇళ్లు, వంతెనలకు భారీ నష్టం**

వరదల ధాటికి సుమారు 35 నుంచి 40 ఇళ్లు కొట్టుకుపోయినట్లు ప్రాథమిక నివేదికలు వెల్లడించాయి. పలు గ్రామాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. కనీసం ఆరు వంతెనలు దెబ్బతిన్నట్లు సమాచారం. దీంతో కొన్ని ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ శిబిరం, అక్కడి పరికరాలు కూడా వరదలో కొట్టుకుపోయాయి. ఐదుగురు ఆచూకీ తెలియడం లేదని కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. నేపాల్ సైన్యం 49 మందిని సురక్షితంగా రక్షించింది. తాజా సమాచారం ప్రకారం, ప్రాణనష్టం నమోదైనట్లు అధికారులు ధ్రువీకరించలేదు.

**లోతట్టు ప్రాంతాలకు హెచ్చరికలు**

వరద ముప్పు నేపథ్యంలో నేపాల్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అప్రమత్తమైంది. బుధిగండకి నది నుంచి త్రిశూలి నది సంగమ ప్రాంతం వరకు నదీ తీరాలకు వెళ్లవద్దని ప్రజలను హెచ్చరించింది. నది పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్నవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు, ఎత్తైన ప్రదేశాలకు తరలివెళ్లాలని సూచించింది. గోర్ఖాతో పాటు ధాదింగ్, తనహూన్, చిత్వన్, తూర్పు, పశ్చిమ నావల్పరాసి జిల్లాల్లోనూ అప్రమత్తత ప్రకటించారు. పరిస్థితిని పర్యవేక్షించేందుకు నేపాల్ సైన్యం, పోలీసులు రంగంలోకి దిగారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్నవారిని రక్షించేందుకు హెలికాప్టర్ల సాయంతో చర్యలు చేపట్టారు. నదిలో నీటి ప్రవాహం ఇంకా హెచ్చుతగ్గులకు లోనవుతుండటంతో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వరద నష్టం పూర్తిస్థాయిని అంచనా వేసే పనులు కొనసాగుతున్నాయి

# సౌదీ రక్షణ ఒప్పందంపై ఇరాన్ ఫైర్

**యెమెన్‌లో జోక్యం చేసుకుంటే పరిణామాలు తీవ్రమని హెచ్చరిక**

సౌదీ అరేబియా, పాకిస్తాన్, టర్కీ మధ్య కుదిరిన ఉమ్మడి రక్షణ ఒప్పందం కార్యరూపం దాల్చడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ముఖ్యంగా యెమెన్‌లో హౌతీ తిరుగుబాటుదారులపై సౌదీ మద్దతుతో సైనిక చర్యలు తీవ్రతరం కావడం, ఈ కూటమి అమలులోకి రావడంపై ఇరాన్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. అమెరికాతో చర్చల్లో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ ఈ రక్షణ కూటమిలో కీలక పాత్ర పోషిస్తుండటం కూడా టెహ్రాన్‌కు ఆందోళన కలిగిస్తోంది.

**అక్టోబర్ 5న కార్యాచరణలోకి రక్షణ ఒప్పందం**

సౌదీ అరేబియాపై హౌతీ క్షిపణి, డ్రోన్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ఆగస్టులో కుదిరిన 'మక్కా ఉమ్మడి రక్షణ ఒప్పందం' అమలుకు అక్టోబర్ 5న కీలక నిర్ణయం తీసుకున్నారు. రియాద్‌లో సమావేశమైన మూడు దేశాల ప్రతినిధులు ఉమ్మడి రక్షణ చర్యలను వేగవంతం చేయాలని, అవసరమైన సైనిక సామర్థ్యాలను సౌదీలో త్వరగా మోహరించాలని అంగీకరించారు. అయితే, ఎంతమంది సైనికులను ఎప్పుడు పంపుతారనే పూర్తి వివరాలు వెల్లడించలేదు.

**పాకిస్థాన్ సైనికుల మోహరింపుపై ఇరాన్ ఆందోళన**

ఈ పరిణామాలపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్



బఘాయీ స్పందిస్తూ.. యెమెన్ వ్యవహారాల్లో ఏ దేశమైనా జోక్యం చేసుకుంటే ప్రాంతీయంగా అవాంఛనీయ పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సౌదీ అరేబియాకు మద్దతుగా వేలాది పాకిస్థాన్ సైనికులను పంపవచ్చన్న వార్తలపైనా స్పందించారు. అలాంటి వార్తలు తమకు కూడా వినిపించాయని, అవి నిజం కాకూడదని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కూటమిని ముస్లిం దేశాల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉపయోగించకూడదని సూచించారు.

టర్కీ మాత్రం తన పాత్రను ప్రధానంగా రక్షణాత్మక చర్యలకే పరిమితం చేస్తామని సంకేతాలిచ్చింది. సౌదీ రక్షణకు అవసరమైన వైమానిక రక్షణ, సాంకేతిక సహకారం వంటి అంశాలను పరిశీలిస్తున్నామని టర్కీ విదేశాంగ మంత్రి హకాన్ ఫిదాన్ తెలిపారు. యెమెన్‌లో దాడులు నిర్వహించేందుకు సైనికులను పంపే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

**రియాద్‌పై తాజా దాడితో మరింత ఉద్రిక్తత**

ఇదిలా ఉండగా, అక్టోబర్ 10న రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన క్షిపణి దాడిలో 12 మంది మరణించగా, 300 మందికి పైగా గాయపడినట్టు తాజా వార్తా నివేదికలు వెల్లడించాయి. ఈ దాడికి హౌతీలు బాధ్యత వహించినట్టు రాయిటర్స్, అసోసియేటెడ్ ప్రెస్ కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటనతో సౌదీపై భద్రతాపరమైన ఒత్తిడి మరింత పెరిగింది. మొత్తంగా, సౌదీ అరేబియా తన రక్షణను బలోపేతం చేసుకునే ప్రయత్నాలు చేస్తుండగా, పాకిస్థాన్, టర్కీ మద్దతు ప్రాంతీయ శక్తుల మధ్య సమీకరణాలను మార్చే అవకాశముంది. అయితే ఈ కూటమి యెమెన్‌లో ప్రత్యక్ష సైనిక చర్యలకు దిగుతుందా, లేక సౌదీ రక్షణకే పరిమితమవుతుందా అన్నది రాబోయే రోజుల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది. అమెరికాతో చర్చలకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహిస్తున్న నేపథ్యంలో, ఇరాన్‌తో దాని దౌత్య సంబంధాలపై కూడా ఈ పరిణామాలు ప్రభావం చూపవచ్చు.

# అర్షదీప్ దెబ్బకు విండీస్ విలవిల








## భారత్ ఖాతాలో మూడో టీ20

ఇండోర్: ఉత్కంఠ పోరులో టీమిండియా 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. వెస్టిండీస్‌తో ఆదివారం జరిగిన మూడో టీ20లో భారత్ 223 పరుగుల భారీ స్కోరు సాధించి, ప్రత్యర్థిని 209/7కే పరిమితం చేసింది. లక్ష్య ఛేదనలో విండీస్ బ్యాటర్లు చివరి వరకు పోరాడినా.. భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి జట్టుకు విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 బుధవారం హైదరాబాద్‌లో జరగనుంది.

### అభిషేక్ శర్మ విధ్వంసం.. పవర్‌ప్లేలో పరుగుల వరద

టాస్ గెలిచిన వెస్టిండీస్ తొలుత బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. సంజు శాంసన్ మూడు పరుగులకే వెనుదిరిగాడు. అయితే మరో ఓపెనర్ అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను పరుగులు పెట్టించాడు. వీరిద్దరూ విండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగడంతో హోల్కర్ స్టేడియంలో పరుగుల వర్షం కురిసింది. అభిషేక్ కేవలం 30 బంతుల్లోనే 69 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లను హడలెత్తించాడు. అతడి ఇన్నింగ్స్‌లో ఆరు ఫోర్లు, ఐదు సిక్సర్లు ఉన్నాయి. బంతిని బలంగా బాదడమే కాకుండా.. ఖాళీ ప్రదేశాల్లోకి షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఇషాన్ కిషన్ కూడా 18 బంతుల్లో 37 పరుగులు చేసి చెలరేగాడు. అతడి ఖాతాలో ఆరు ఫోర్లు, ఒక సిక్సర్ చేరాయి. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు కేవలం 40 బంతుల్లోనే 108 పరుగులు జోడించారు. తొలి ఆరు ఓవర్లలోనే భారత్ 87 పరుగులు సాధించడం అభిషేక్ దూకుడుకు నిదర్శనం. వెస్టిండీస్‌పై టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో భారత బ్యాటర్ సాధించిన అత్యంత వేగవంతమైన అర్ధశతకంగా అభిషేక్ 18 బంతుల్లో అందుకున్న హాఫ్ సెంచరీ నిలిచింది. అంతేకాకుండా, ఈ ఇన్నింగ్స్‌తో అతడు టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 2,000 పరుగుల మైలురాయిని కూడా చేరుకున్నాడు.

### మధ్య ఓవర్లలో కుప్పకూలిన భారత్

ఒక దశలో భారత్ 250 పరుగుల మార్కును దాటేలా కనిపించింది. అయితే అభిషేక్ ఔటైన తర్వాత భారత బ్యాటింగ్ వేగం తగ్గింది. ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ వికెట్లను కూడా భారత్ త్వరగానే కోల్పోయింది. శ్రేయస్ ఒక్క పరుగుకే వెనుదిరగడంతో విండీస్ బౌలర్లు మ్యాచ్‌లోకి తిరిగి వచ్చారు.

తిలక్ వర్మ 16 బంతుల్లో 28 పరుగులు చేసి స్కోరు వేగాన్ని పెంచే ప్రయత్నం చేశాడు. నితీశ్ కుమార్ రెడ్డి 14 బంతుల్లో 21 పరుగులు, అక్షర్ పటేల్ 14 బంతుల్లో 20 పరుగులు సాధించారు. అయితే అనవసర పరుగుల కోసం ప్రయత్నించడం, రనౌట్లు భారత్ భారీ స్కోరు సాధించే అవకాశాలను దెబ్బతీశాయి. ముఖ్యంగా తిలక్ వర్మ రనౌట్ కావడం జట్టుకు గట్టి ఎదురుదెబ్బగా మారింది. మధ్య ఓవర్లలో వరుసగా వికెట్లు కోల్పోవడంతో భారత్ 115/1 నుంచి 135/5కు పడిపోయింది. చివరి ఐదు ఓవర్లలోనూ ఆశించిన స్థాయిలో పరుగులు రాలేదు. అయినప్పటికీ చివర్లో ప్రిన్స్ యాదవ్ ఆరు బంతుల్లో అజేయంగా 13 పరుగులు చేయడంతో భారత్ 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. విండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్, షమర్ స్ప్రింగర్, షమర్ జోసెఫ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. గుడకేశ్ మోటీ, కీమో పాల్ చెరో వికెట్ తీశారు.

### హెట్మయర్, పూరన్ పోరాటం వృథా

224 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ దూకుడుగానే ఆడింది. షిమ్రోన్ హెట్మయర్ 26 బంతుల్లో 43 పరుగులు చేయగా, కమిల్ పూరన్ 27 బంతుల్లో 42 పరుగులు సాధించాడు. షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 32 పరుగులతో జట్టును విజయానికి చేరువ చేసే ప్రయత్నం చేశాడు. సాంప్సన్ 21 పరుగులు చేశాడు. అయితే కీలక భాగస్వామ్యాలు ఏర్పడిన ప్రతిసారీ భారత బౌలర్లు వికెట్లు తీసి విండీస్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. నామన్ ధీర్ రెండు కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జోరుకు అడ్డుకట్ట వేశాడు. అక్షర్ పటేల్, నితీశ్ రెడ్డి కూడా చెరో వికెట్ తీసి తమ వంతు సహకారం అందించారు. చివరి ఓవర్లలో షమర్ స్ప్రింగర్ విధ్వంసకర బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ఉత్కంఠభరితంగా మార్చాడు. అతడు కేవలం 11 బంతుల్లోనే అజేయంగా 35 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో రెండు ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. అయితే అప్పటికే విజయానికి అవసరమైన పరుగుల ఒత్తిడి పెరగడంతో విండీస్ లక్ష్యాన్ని అందుకోలేకపోయింది. నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 209 పరుగులే చేసి 14 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్ మూడు వికెట్లు పడగొట్టి విజయానికి కీలకంగా నిలిచాడు. నామన్ ధీర్ రెండు వికెట్లు తీశాడు. అక్షర్ పటేల్, నితీశ్ రెడ్డి చెరో వికెట్ సాధించారు.

### సిరీస్‌పై భారత్ గురి

ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1తో ముందంజలో నిలిచింది. తొలి టీ20లో గెలిచిన భారత్‌కు రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ షాక్ ఇచ్చింది. మూడో మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కీలక సమయాల్లో రాణించిన టీమిండియా తిరిగి ఆధిక్యాన్ని సాధించింది. అయితే బ్యాటింగ్‌లో ఆరంభంలో వచ్చిన జోరును చివరి వరకు కొనసాగించలేకపోవడం భారత జట్టుకు ఆందోళన కలిగించే అంశం. మరోవైపు భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో విండీస్ బ్యాటర్లు చూపిన పోరాటం కూడా భారత బౌలర్లకు గట్టి పరీక్షగా నిలిచింది. సిరీస్‌లో ఆధిక్యాన్ని మరింత పెంచుకోవాలనే లక్ష్యంతో భారత్ బుధవారం హైదరాబాద్‌లో జరిగే నాలుగో టీ20కి సిద్ధం కానుంది.

---

యునిసెఫ్ ఇండియా

## సెలబ్రిటీ అడ్వకేట్‌గా స్మృతి మంధాన



న్యూఢిల్లీ: భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన స్మృతి మంధానకు మరో అరుదైన గౌరవం దక్కింది. ఆమె యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా నియమితులయ్యారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. బాలికలకు సమాన అవకాశాలు, వారి ఆరోగ్యం, సంక్షేమం, క్రీడల్లో అవకాశాలు వంటి అంశాల్లో యునిసెఫ్‌తో కలిసి స్మృతి పనిచేయనున్నారు. ఈ సందర్భంగా స్మృతి మాట్లాడుతూ.. "యునిసెఫ్ ఇండియాలో సెలబ్రిటీ అడ్వకేట్‌గా చేరడం చాలా గర్వంగా ఉంది. క్రికెట్ ఆడుతూ పెరగడం వల్ల ప్రతి కల ఒక అవకాశంతోనే మొదలవుతుందని నేను నేర్చుకున్నాను. కఠోర శ్రమ, పట్టుదల, ప్రోత్సాహంతో ఆ అవకాశం ఒక అసాధారణమైన విషయంగా మారగలదు. పెద్ద కలలు కనేందుకు, తమ పూర్తి సామర్థ్యాన్ని అందుకునేందుకు ప్రతి ఒక్కరికీ అవకాశం దక్కాలి" అని పేర్కొన్నారు.

---

ఇండోర్ టీ20కి ముందు

## మహాకాళేశ్వరుని సన్నిధిలో గంభీర్, కోటక్



ఇండోర్: భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో కీలకమైన మూడో టీ20 ప్రారంభానికి ముందు.. ఆదివారం ఉదయం టీమిండియా హెడ్ కోచ్ గంభీర్, బ్యాటింగ్ కోచ్ కోటక్ ఉజ్జయినిలోని ప్రఖ్యాత మహాకాళేశ్వర ఆలయాన్ని సందర్శించి, పరమశివుడి ఆశీస్సులు తీసుకున్నారు. తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత్, వెస్టిండీస్‌లు చెరో విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సమంగా ఉండటంతో, ఈ పోరులో గెలిచిన జట్టు ఆధిక్యంలోకి వెళ్తుంది. ఈ నేపథ్యంలో గంభీర్, కోటక్ మహాకాళేశ్వర ఆలయ దర్శనం ప్రాధాన్యత సంతరించుకుంది. దర్శనానంతరం గంభీర్ మీడియాతో మాట్లాడారు. "స్వామివారే తనను దర్శనానికి పిలిచారని, ఆయన ఆశీస్సులు తనకు, దేశానికి ఎల్లప్పుడూ ఉంటాయని" చెప్పారు. జట్టు కచ్చితంగా రాణిస్తుందని, దేవుడి ఆశీర్వాదం తమతోనే ఉందని విశ్వసిస్తున్నానని ధీమా వ్యక్తం చేశారు. గంభీర్, కోటక్ ఈ ఆలయాన్ని సందర్శించడం ఇదే తొలిసారి కాదు. ఈ ఏడాది జనవరిలో హోల్కర్ స్టేడియంలోనే న్యూజిలాండ్‌తో జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేకు ముందూ వారు ఇక్కడికి వచ్చారు. అప్పుడు ఇద్దరు కోచ్‌లు తెల్లవారుజామున జరిగే భస్మ హారతిలో పాల్గొని, దాదాపు రెండు గంటలపాటు నంది హాల్‌లో కూర్చుని జట్టు విజయం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గంభీర్‌కు మహాకాళేశ్వరుడిపై అపారమైన భక్తి ఉందని, గతంలోనూ పలుమార్లు కుటుంబంతో కలిసి దర్శనం చేసుకున్నారని

# 'జై హనుమాన్'లో మమితా బైజు?

మమితా బైజు.. ప్రస్తుతం దక్షిణాది సినీ పరిశ్రమల్లో ఈ పేరు యువ ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ సంపాదించుకుంది. సహజమైన నటన, ఆకట్టుకునే స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మలయాళ ముద్దుగుమ్మకు వరుస విజయాలు తోడవడంతో అవకాశాలూ వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఆమె మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగం కానున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. మమితా బైజు నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్', 'బెల్లెహం కుటుంబ యూనిట్' చిత్రాలు థియేటర్లలో మంచి విజయాన్ని అందుకోవడంతో ఆమె క్రేజ్ మరింత పెరిగింది.

విభిన్న కథలు, వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె ప్రస్తుతం పలు సినీ పరిశ్రమల్లో బిజీ నటిగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆమె తదుపరి ప్రాజెక్టులపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. తాజా సమాచారం ప్రకారం, ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో






తెరకెక్కుతున్న 'జై హనుమాన్' చిత్రంలో మమితా బైజు నటిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రానికి సంబంధించిన షూటింగ్‌లో ఆమె ఇప్పటికే పాల్గొంటున్నట్టు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే, ఈ విషయంపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. 'హనుమాన్' చిత్రంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'జై హనుమాన్' రూపొందుతోంది. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న సూపర్ హీరో చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మిస్తున్నాయి.

# ప్రయోగంపై ప్రశాంత్ ఫోకస్..



యంగ్ టైగర్ ఎన్టీఆర్, మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఎప్పటికప్పుడు వినిపిస్తున్న అప్‌డేట్స్ సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. తాజాగా ఈ సినిమా షూటింగ్, విజువల్స్‌కు సంబంధించి ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. గాయంనుంచి కోలుకుంటున్న ఎన్టీఆర్ త్వరలోనే తిరిగి షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రముఖ అల్యూమినియం ఫ్యాక్టరీలో 'డ్రాగన్' కోసం ఇప్పటికే భారీ సెట్‌ను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. నవంబర్ మొదటివారం నుంచి సెట్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుందని ప్రచారం జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో తారక్‌తోపాటు ఇతర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు టాక్/ ఇక ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన అంశం విజువల్ ట్రీట్. ప్రశాంత్ నీల్ గత చిత్రాల్లో డార్క్ టోన్స్, బ్లాక్ అండ్ గ్రే షేడ్స్‌కు ప్రాధాన్యం కనిపిస్తుంటుంది. అయితే 'డ్రాగన్'లో మాత్రం ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్‌ను పూర్తిగా భిన్నమైన శైలిలో, కలర్‌ఫుల్ విజువల్స్‌తో తెరకెక్కించనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందిస్తాయని సినీవర్గాల్లో చర్చ జరుగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఎన్టీఆర్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు ప్రశాంత్ నీల్ మేకింగ్ తోడైతే వెండితెరపై ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రవితేజ, వివేక్ ఆత్రేయ కాంబోలో 'తులాభారం'




మాస్ మహారాజా రవితేజ, వైవిధ్యమైన కథాంశాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు 'తులాభారం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసిన మేకర్స్.. తాజాగా ప్రత్యేకమైన టైటిల్ డాక్యుమెంటరీని విడుదల చేశారు. బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రానికి సంబంధించిన టైటిల్ ప్రకటన ఇప్పుడు టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. విభిన్నమైన కథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని ప్రదర్శించే వివేక్ ఆత్రేయ.. ఈసారి రవితేజ కోసం ఎలాంటి కథను సిద్ధం చేశారన్న ఆసక్తి నెలకొంది. రవితేజ మాస్ ఇమేజ్‌కు, దర్శకుడి ప్రత్యేకమైన కథన శైలి తోడైతే వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ అవుతుందోనని అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజాగా విడుదలైన టైటిల్ డాక్యుమెంటరీ సినిమా నేపథ్యం, నిర్మాణానికి సంబంధించిన విశేషాలను పరిచయం చేస్తూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచేలా ఉంది. ఈ చిత్రానికి రాక్ స్టార్ వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు.

టైటిల్‌లోని ప్రత్యేకత, దర్శకుడి ఎంపిక చేసిన కథాంశం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటన్నది తెలుసుకోవాలనే ఆసక్తి ప్రేక్షకుల్లో కనిపిస్తోంది. ఇక ఈ సినిమాలో ప్రియాంక మోహన్, అనస్వర రాజన్ కథానాయికలు.

జేడీ చక్రవర్తి, తరుణ్ భాస్కర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విభిన్నమైన నటీనటుల కలయిక ప్రాజెక్ట్‌పై అంచనాలను పెంచుతోంది. త్వరలోనే చిత్ర బృందం సినిమా కథ, ఇతర నటీనటులు, విడుదలకు సంబంధించిన మరిన్ని వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.

# '..అందుకే.. ఆ ఛానెల్'!



బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్ తన కొత్త యూట్యూబ్ ఛానల్ 'బీయింగ్ సల్మాన్ ఖాన్'పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఛానల్‌లోని వీడియోలు పెద్దల కోసం కాదని, కేవలం చిన్నపిల్లల కోసమేనని స్పష్టం చేశారు. ఈ మేరకు ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. "నా యూట్యూబ్ ఛానల్ చూస్తున్నందుకు ధన్యవాదాలు. అందులోని కంటెంట్ మీకు అంతగా నచ్చకపోవచ్చు. ఎందుకంటే.. అది మీ కోసం కాదు, మీ ఇంట్లోని చిన్నపిల్లల కోసం మాత్రమే. వినోదం, ప్రేమ, కుటుంబ బంధాలతోపాటు పిల్లలకు విద్య కూడా ఎంతో అవసరం కదా" అని సల్మాన్ రాసుకొచ్చారు. మిగతా సెలబ్రిటీల ఛానల్స్ తరహాలో ఈ ఛానల్లో వ్యక్తిగత విషయాలు, షూటింగ్ విశేషాలు ఉండవు. సల్మాన్ ఇందులో రెండు భిన్నమైన పాత్రల్లో కనిపిస్తారు. నటన నేర్పించే గురువుగా.. అలాగే విద్యార్థిగా. బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, హావభావాలు తదితర అంశాలను పిల్లలకు అర్థమయ్యేలా ఎంతో సరదాగా ఇందులో నేర్పిస్తున్నారు. యూట్యూబ్‌లోకి సల్మాన్ రావడం ఇదే తొలిసారి కాదు. 2020 కరోనా సమయంలో 'సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ మ్యూజిక్' పేరిట ఛానల్ ప్రారంభించారు. దానికి దాదాపు 30 లక్షలమంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. అందులో ఆయన స్వయంగా పాడిన 'ప్యార్ కరోనా', 'తేరే బినా'లాంటి పాటలను విడుదల చేశారు. ఇక సల్మాన్ ప్రస్తుతం 'బిగ్ బాస్ 20'కి హోస్ట్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ షోకు ఆయన వ్యాఖ్యాతగా వ్యవహరించడం ఇది 15వ సారి. మరోవైపు అపూర్వ లాఖియా దర్శకత్వంలో 'మాతృభూమి' అనే సినిమాలో నటిస్తున్నారు. చిత్రాంగద సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్న సినిమా విడుదల వాయిదా పడింది.

# ఓటీటీపైనా కిరణ్ గురి

విభిన్న కథలతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న కిరణ్ అబ్బవరం.. ఇప్పుడు నటుడిగానే కాకుండా దర్శకుడు, రచయితగా కొత్త ప్రయోగాలకు సిద్ధమవుతున్నారు. ఓవైపు సినిమాలు, మరోవైపు తొలిసారి ఓటీటీ ఎంట్రీ.. ఇలా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆయన, తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, రాబోయే చిత్రాల విశేషాలను పంచుకున్నారు. ఐదేళ్ల క్రితం 'ఎస్ఆర్ కళ్యాణమండపం'కు కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించిన కిరణ్.. ఇప్పుడు 'రియాలిటీ'తో మళ్లీ రచన, దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. మధ్యతరగతి యువత ఎదుర్కొంటున్న పెళ్లి ఒత్తిళ్ల నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో, బడ్జెట్‌లో పెళ్లి చేసుకోవాలనుకునే ఓ యువకుడి జీవితంలో ఎదురయ్యే పరిణామాలను వినోదాత్మకంగా చూపించనున్నారు. డిసెంబర్ 25న సినిమా విడుదల కానుంది.



గతంలో చేసిన 'మీటర్' తనకు కీలకమైన పాఠం నేర్పిందని కిరణ్ తెలిపారు. రొటీన్ కథాంశమైనా కొత్తదనం లేకపోతే ప్రేక్షకులు ఆదరించరని, సినిమా విడుదలకు ముందే కథలోని లోపాలను గుర్తించి సరిదిద్దుకోవాలని అభిప్రాయపడ్డారు. ఇక 'కాంతారా: చాప్టర్-1'కు పనిచేసిన శ్రీకాంత్ పుప్పాల దర్శకత్వంలో 'ఇంద్రపుత్ర' చేస్తున్నారు. ఇది సమకాలీన కథాంశంతో సాగే చిత్రమని, తొలి 15-20 నిమిషాల్లోనే పౌరాణిక అంశాలు ఉంటాయని వెల్లడించారు. తాను నిర్మాతగా వ్యవహరిస్తున్న హారర్ థ్రిల్లర్ 'హతః' కూడా ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు 'డియర్ కామ్రేడ్' దర్శకుడు భరత్ కమ్మ రూపొందిస్తున్న 'గువ్వల చెరువు ఘాట్'తో డిజిటల్ రంగంలోకి అడుగుపెడుతున్నారు. 1980ల రాజకీయ నేపథ్యంతో ఎనిమిది ఎపిసోడ్‌లుగా తెరకెక్కుతున్న ఈ సిరీస్‌లో జర్నలిస్ట్‌గా కనిపించనున్నారు. ఇలా విభిన్న జానర్లను ఎంచుకుంటూ, తెర వెనుక బాధ్యతలూ చేపడుతున్న కిరణ్ అబ్బవరం.. తన కెరీర్‌లో కొత్త అధ్యాయానికి సిద్ధమవుతున్నారు.

# అమితాబ్ 84వ పుట్టినరోజు.. 'జల్సా' ముందు అభిమానుల సందడి





బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ పుట్టినరోజు సందర్భంగా ముంబైలోని ఆయన నివాసం 'జల్సా' అభిమానులతో సందడిగా మారింది. అక్టోబర్ 11న అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని తమ అభిమాన నటుడికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అమితాబ్ నటించిన ఐకానిక్ సినిమాల పోస్టర్లు, భారీ కటౌట్లతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ వేడుకల్లో ఓ అభిమాని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమితాబ్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'డాన్'లోని 'మై హూ డాన్' పాటను పాడుతూ, 84 సంఖ్యతో కూడిన పోస్టర్‌ను ప్రదర్శించారు. దీంతో అక్కడి వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. చిన్నారులు సైతం ఈ వేడుకల్లో పాల్గొని, అమితాబ్ పోస్టర్లతో ఫొటోలు దిగుతూ సందడి చేశారు. అమితాబ్‌పై అభిమానులకు ఉన్న ప్రేమాభిమానాలు మరోసారి ఈ వేడుకలతో స్పష్టమయ్యాయి. ప్రతి ఏడాది ఆయన పుట్టినరోజు సందర్భంగా ముంబైతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా అభిమానులు 'జల్సా' వద్దకు చేరుకోవడం ఆనవాయితీగా వస్తోంది. తమ అభిమాన నటుడిని ఒక్కసారైనా ప్రత్యక్షంగా చూడాలనే ఆశతో గంటల తరబడి ఎదురుచూస్తుంటారు. తాజాగా ఈ పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దశాబ్దాలుగా వెండితెరపై తనదైన ముద్ర వేసిన అమితాబ్ బచ్చన్‌కు తరాలు మారినా అభిమానుల్లో ఆదరణ కొనసాగుతుండటం విశేషం.